₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 06

మార్చి 16-31, 2018







## న్యూ ఇండియా @ 2022... పాత ఆలోచనలతోనా?

## ఏపీకి కేంద్రం బాకీ రూ.74,542 కోట్లు

- పోలవరం, హోదా పన్ను రాయితీలు అదనం
- ప్రత్యేక హోదాకు ప్రత్యామ్నాయం లేదు... పన్ను రాయితీలు హోదాలో భాగమే
- పోలవరం బాధ్యత కేంద్రానిదే
- రాయలసీమ, ఉత్తరాంధ్రలకు రావాల్సిన మొత్తం రూ.23,350 కోట్లు
- 'కీలక' గందరగోళాలపై స్పష్టతనిచ్చిన జేఎఫ్‌సీ నివేదిక



## ఉత్తరాది - దక్షిణాది !




# మూడంచెల ఫెడరలిజం ఉంటే... జెనీ కూడా దండుగే !

అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి అభివృద్ధి చెందిన దేశంగా మారటానికి చేస్తున్న ప్రయాణంలో భారత్‌కు ఓ జెనీ (కోరి కల్ని తీర్చే ఓ మంచి భూతం) ఎదురైంది. 'నీ కోరికేంటో చెప్పు' అని జెనీ అడిగింది. 'నన్ను సమగ్రంగా, శక్తిమంతంగా తయారుచెయ్యి' అని ఇండియా కోరింది. ఈ వెంటనే ఇండియా అనేకానేక భాగాలుగా కనిపించింది. "ఏం చేస్తున్నావ్ నువ్' అని భారత్ మండిపడింది. 'నేను కొత్తగా చేసిందేమీ లేదు. నీలో ఉన్నదే స్ఫుటంగా చూపానంతే. మూడంచెల ఫెడరలిజమే నిన్ను శక్తిమంతంగా మారుస్తుంది' అని జెనీ చెప్పింది. ఇండియాకు విషయం అర్థమైంది. ఎన్ని పిక్సెళ్లు ఉంటే పిక్చర్ అంత అందంగా ఉంటుంది గదా! అనుకుంది. 'ఇక తనకు జెనీ అక్కర్లేదు. అధికార వికేంద్రీకరణతో నిర్మించే 'కేంద్ర-రాష్ట్ర-స్థానిక ప్రభుత్వాల' సాధికార వ్యవస్థే తనకు అసలైన బలం' అని భారత్ గుర్తించింది.

ఈ కాన్సెప్ట్ డ్రాయింగ్‌ను ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ఇంటర్న్‌షిప్‌లో జావెద్ (సీనియర్ జర్నలిస్టు జకీర్ కుమారుడు) అందించారు.

లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ ఎన్నో ఏళ్లుగా పిలుపునిస్తున్నట్టు... ఇకనైనా 'మూడంచెల ఫెడరలిజాన్ని సాధిద్దాం-వేయి పూలు వికసించనిద్దాం!'

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

మార్చి 16-31, 2018 సంపుటి - 2 సంచిక - 06




# కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

ఏపీకి కేంద్రం బాకీ రూ. 74,542 కోట్లు........5
న్యూ ఇండియా @ 2022.. పాత ............... 8
ట్రూడో పర్యటన - జాతీయ భద్రతపై............... 14
'ప్రజలకు జైలు... అవినీతి అధికారులకు ముద్దు'.. 17
నే చూసిన అత్యంత తెలివైన మహిళల్లో ........ 19
సంస్కర్త, దళిత బాంధవుడు దామోదరం.........20
గ్రామ పంచాయతీలకు కొత్త చట్టం.............. 21
నిధులు మస్తు - పల్లెలు పస్తు........................ 23
బ్యాలెట్ బాక్సుల్లో మగ్గుతున్న ప్రజాస్వామ్యం..... 25
కడప స్టీల్‌ప్లాంట్ సహా పరిశ్రమలు వేగంగా...... 27
ఆలోచనకు పదును పెట్టే చదువున్న దేశం........ 28
మ్యాక్స్ సంఘాలుగా ఏర్పడి పంటల్ని............. 30
అభిప్రాయాలు చెప్పండి ............................ 31
(మీడియాలో) 'కీ' కామెంట్లు....................... 32
ప్రజల గోడు పట్టని గవర్నర్, ముఖ్యమంత్రి.........34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బందారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె. వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# ఉత్తరాది - దక్షిణాది!



మన రాజ్యాంగంలోని నిశ్శబ్దాలు, తాత్కాలిక ఏర్పాట్లు ఇప్పుడు రకరకాల సమస్యలు, ఆందోళనలకు దారితీస్తున్నాయి. దేశ విభజన సమయంలో చోటుచేసుకున్న హింస, సంస్థానాల విలీన అనుభవాలు వంటివాటి మూలంగా రాజ్యాంగ నిర్మాతలు, జాతీయోద్యమ నేతలు బలమైన కేంద్రం వైపు మొగ్గుచూపారు. ప్రజాస్వామ్యానికి ప్రతికూలంగా, అవరోధంగా పనిచేసే ఇంకొన్ని సంస్థాగత, సాంస్కృతిక లోపాల్ని కూడా చూసీచూడనట్టు వదిలేశారు. ఇదేసమయంలో అమెరికా వంటి ప్రజాస్వామ్యాలు, భారతీయతల్లోని ఉదాత్త భావాలను జోడించి రాజ్యాంగాన్ని ఓ అద్భుత డాక్యుమెంట్‌గా తీర్చిదిద్దారు. దీంతో మన ప్రజాస్వామ్యం 'ఓట్ అండ్ షాట్'కు పరిమితమైంది. ప్రభుత్వోద్యోగులు బ్రిటిష్ కాలం నాటి తరహాలోనే ప్రజల కంటే అనేకరెట్లు శక్తిమంతులుగా, ప్రజలపై పెత్తనం చేసేవారిగా కొనసాగటం.., చిన్నపనికి కూడా ప్రజలు లంచాలిచ్చే, దేబిరించే స్థితిలో ఉండటంతో అధికారాల విభజన ఆగమాగమైంది. ఓట్ల కోసం రాజకీయ నేతలు శాసనకర్తల నుంచి ప్రభుత్వ పాత్రలోకి మారటం మొదలైంది. జాతీయోద్యమ కాలంనాటి నేతలు ఎంతో నిజాయతీతో, జీవితాల్ని ఫణంగా పెట్టి పేదలకు సేవలందించినా ప్రజలందరి అవసరాలనూ తీర్చలేకపోయారు. వారి తరం పోగానే.. చేసిన సేవలకు దండుకునే తరం, నాయకుల అవతారమెత్తారు. దీంతో ఎన్నికల్లో డబ్బు ప్రభావం తీవ్రస్థాయికి చేరింది. ప్రజలకు అందుబాటులో ఉండే పేరుతో నియోజకవర్గంలో అప్రజాస్వామిక వ్యక్తుల గుత్తాధిపత్యం మొదలైంది. ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించి జాతీయ పార్టీల్ని బలహీనపరచసాగాయి. కేంద్రంలోని అధికార కేంద్రీకరణకు వ్యతిరేకంగా 1980లలో ప్రాంతీయ పార్టీల నేతలు మహానగరాల్లో 'కాంక్లేవ్‌లు' నిర్వహించి చేసిన పోరాటాల వల్ల రాష్ట్రాలకు అధికారాలు గణనీయంగా పెరిగాయి. ఫెడరలిజం విస్తరించింది. దీనివల్లే ఈవేళ కేంద్ర బడ్జెట్‌లో నుంచి 50.5శాతం, పన్నుల డబ్బులో నుంచి 67శాతం రాష్ట్రాలకు నేరుగా ఢిల్లీ నుంచి వస్తోంది. అయినా ప్రజల సమస్యలు పరిష్కారం కావటం లేదు. 'రాజ్యాంగంలోని అధికార కేంద్రీకరణ' కేంద్రం నుంచి రాష్ట్రాలకు దిగింది తప్ప పాలన తీరు మాత్రం మారకపోవటం ఇందుకు ప్రధాన కారణం. ప్రజలు నివసించే స్థానిక ప్రభుత్వాల్లో రోజువారీ పనుల కోసం అగచాట్లు తప్పటం లేదు. ఇటువంటి తరుణంలో కొన్ని సున్నితమైన అంశాల్లో కేంద్రం చూపే నిర్లక్ష్యం ప్రజల అసంతృప్తిని, ఆగ్రహావేశాల్ని అవధులు దాటిస్తుంది. ఉత్తర భారతం-దక్షిణ భారతం వేరు వేరు అనే భావన మళ్లీ ఇప్పుడు దక్షిణాదిన దూరమేఘ గర్జనలా వినిపించటం అలాంటి సన్నివేశమే! రాష్ట్ర విభజనప్పుడు తమ గుండెఘోషను పట్టించుకోకుండా విడగొట్టారని, ఆ తర్వాత కేంద్రంలో అధికారంలోకొచ్చిన పార్టీ కూడా విభజన హామీల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అవమానిస్తోందని ఆంధ్రప్రదేశ్‌లోని పలువురు భావిస్తుంటే, జయలలిత మరణాన్ని అవకాశంగా తీసుకుని కేంద్ర పాలకులు నీచ అధికార రాజకీయాలకు పాల్పడ్డారని తమిళనాడులో బలమైన భావన ప్రబలింది. ఎన్నికల సందర్భంలోనే అయినా కర్ణాటకలోనూ ఈ తరహా భావనలు రాజుకున్నాయి. దీనికితోడు ఆర్థికసంఘాలు దక్షిణాది సొమ్ముల్ని ఉత్తరాదికి పందేరం చేస్తున్నారన్న అసంతృప్తి! ఉత్తర-దక్షిణ భావం ఇలా దక్షిణాదిన ఒక్కసారిగా పెరగడానికి ప్రధాని నరేంద్రమోదీ భిన్న పాలనా నమూనా ఆజ్యం పోస్తోందని చెప్పొచ్చు. మోదీ కూడా ఇందిర తరహా కేంద్రీకృత పాలననే చేస్తున్నప్పటికీ, అందులో కూడా మోదీది ఓ ప్రత్యేక నమూనా. కొందరు నమ్మకమైన ఉన్నతాధికారుల కోటరీతో పాలన సాగించే ముఖ్యమంత్రుల పాలనా తీరుని మొదటిసారిగా మోదీ జాతీయస్థాయిలోకి తెచ్చారు. ఇందిర హయాంలో కనీసం కొందరైనా మంత్రులు.. వై.బి చవాన్, సి. సుబ్రహ్మణ్యం, జగ్జీవన్‌రాం వంటి వారు స్వతంత్ర నిర్ణయాలు తీసుకునేవారు. కానీ మోదీ కేబినెట్‌లో అధికారం పూర్తిగా ప్రధానమంత్రి చేతుల్లోకి వెళ్లిపోయింది. కానీ దానికి పరిష్కారం దేశఐక్యతకి, సమగ్రతకి గండికొట్టటం కాదు. మహాత్మాగాంధీ గొప్ప నాయకుడయ్యింది భారత్‌కు స్వాతంత్ర్యాన్ని తేవటం వల్ల కాదు.. ఈ దేశాన్ని కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా ఏకం చేయటం వల్ల! ఈవేళ ప్రపంచ దేశాలన్నీ భారత పరిమిత ప్రజాస్వామ్యాన్నీ ఓ అద్భుతంగా చూస్తున్నాయంటే.. అందుకు జాతీయోద్యమం అందించిన భిన్నత్వంలో ఏకత్వ పునాదే కారణం. మరోవైపు దేశం ముక్కలైతే, 130 కోట్లమంది ఉన్న ఉమ్మడి మార్కెట్ పోయి ఆర్థికంగా తీవ్ర ఒడిదుడుకులు కూడా ఏర్పడతాయి.. అందుకే పటేల్ భౌగోళికంగా ఏకం చేసిన భారతదేశాన్ని ఓ గొప్ప, సంపన్నమైన దేశంగా తీర్చిదిద్దాటంటే ఫెడరల్ వ్యవస్థని పునర్నిర్వచించాలి. 130 కోట్ల దేశంలో పంచాయతీ నుంచి పార్లమెంటుదాకా ఒకే నమూనా పనికిరాదు. మన రాష్ట్రాలు ప్రపంచంలో 90శాతం దేశాలకంటే పెద్దవి. కాబట్టి దేశఐక్యతని, ప్రజల స్వేచ్ఛని కాపాడుతూనే తమకనువయిన రాజకీయ, పాలనా నమూనాలని ఏర్పరచుకునే వెసులుబాటు రాష్ట్రాలకివ్వటం నేటి చారిత్రక అవసరం. ప్రభుత్వ బాధ్యతలైన చట్టబద్ధపాలన, విద్య, ఆరోగ్యం వంటి విషయాల్లో మౌలిక సంస్కరణల్ని తేవాలి. ఇందుకోసం రాష్ట్రాలకు మరింత స్వయంప్రతిని, స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిచ్చేలా మూడంచెల ఫెడరల్ వ్యవస్థను పాదుకొల్పాలి. సువిశాల భిన్నత్వం రీత్యా ఫెడరల్ ప్రజాస్వామ్యమే ఉన్నవాటిలో భారత్‌కు ఉత్తమం కాబట్టి.. దీన్ని మార్చకుండా ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని కట్టడి చేయటానికి దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికల్ని ప్రవేశపెట్టాలి. మన ఉత్తర-దక్షిణ-ఈశాన్య ఆవేశాల్ని ఈ సంస్కరణల దిశగా మళ్లిద్దాం.

# ఏపీకి కేంద్రం బాకీ రూ.74,542 కోట్లు

- పోలవరం, హోదా పన్ను రాయితీలు అదనం
- ప్రత్యేక హోదాకు ప్రత్యామ్నాయం లేదు.. పన్ను రాయితీలు హోదాలో భాగమే
- పోలవరం బాధ్యత కేంద్రానిదే
- రాయలసీమ, ఉత్తరాంధ్రలకు రావాల్సిన మొత్తం రూ.23,350 కోట్లు
- 'కీలక' గందరగోళాలపై స్పష్టతనిచ్చిన జేఎఫ్‌సీ నివేదిక

విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం అన్యాయంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ కమిటీ (జేఎఫ్‌సీ) ధృవీకరించింది. కేంద్రం నుంచి సమాచారం అందక వివరాలు అసమగ్రంగానే ఉన్నప్పటికీ, కొత్తగా ఏం తేలుస్తారు అని కొందరు చప్పరించినప్పటికీ.. ఏపీకి సంబంధించిన విభజన హామీలపై జేఎఫ్‌సీ కీలక స్పష్టతనిచ్చింది. ప్రత్యేకహోదాలో పన్ను రాయితీలు భాగం కాదని కొందరు, భాగమేనని కొందరు చేస్తున్న వాదనలకు తెరదించింది. ప్రత్యేక హోదాతో సమానసాయం కాబట్టే ప్రత్యేక ప్యాకేజీ తీసుకున్నామనే వాదనను కూడా పూర్వపక్షం చేసింది. ప్రత్యేక తరగతి హోదాలోని నాలుగు అంశాలలో పారిశ్రామిక పన్ను రాయితీలు భాగమేనని వివరించింది. ప్రత్యేక హోదా సాయానికి ప్రత్యేక ప్యాకేజీ సాయం సరితూగదని స్పష్టంచేసింది. అలాగే రెవెన్యూలోటుకు సంబంధించిన వాదనల్లో గందరగోళానికి తెరదించింది. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు రూ.24,350 కోట్లు ఇవ్వాల్సి ఉందని తేల్చింది. తెలంగాణ హామీలకు రోడ్‌మ్యాప్‌ను ప్రకటించాలని కోరింది. తాము కొత్తగా కనుక్కున్న విషయాలేమీలేవని, అయితే కుడిచేయి-ఎడంచేయిల మధ్య సంబంధం లేకుండా వ్యవహరిస్తున్న ప్రభుత్వాల తీరుతో నెలకొన్న గందరగోళాన్ని 60-70శాతం మేర తొలగించగలిగామని, దీనివల్ల పరిష్కారం దిశగా ప్రజల సంఘటిత కృషికి, రాజకీయ కార్యాచరణకు అవకాశాలు మెరుగవుతాయని జేఎఫ్‌సీ నివేదికను వెల్లడిస్తూ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ వ్యాఖ్యానించారు కూడా. కీలకాంశాలపై



లెక్కలు తేల్చటంతో పాటు సంబంధిత వివరాల వద్ద కొన్ని విలువైన సూచనల్ని సైతం జేఎఫ్‌సీ ఇచ్చింది.

కేంద్ర ప్రభుత్వం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రూ.74,542 కోట్లు (మార్చి 3, 2018 వరకు) రావాలని జేఎఫ్‌సీ తేల్చింది. ఇది రెవెన్యూలోటు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వంటి గణించదగిన లెక్కల ప్రకారమేనని పేర్కొంది. రాష్ట్రానికి ఇంకా రావాల్సిన రూ.74,542



కోట్ల నిధుల్ని రానున్న బడ్జెట్లలో కేంద్రం కేటాయించాలని సూచించింది. ఏపీకి ప్రత్యేక తరగతి హోదాకు ప్రత్యామ్నాయం లేదని ప్రకటించింది. పోలవరం ప్రాజెక్టు బాధ్యత పూర్తిగా కేంద్రానిదే కాబట్టి.. ఆ నిధుల ప్రస్తావన చేయలేదని తెలిపింది. ఈ అంతర్రాష్ట్ర బహుళార్థ ప్రాజెక్టును నిర్ణీత కాలవ్యవధిలో నిర్మించి ఇవ్వాలని సూచించింది. 10వ షెడ్యూల్‌లో ఉన్న సంస్థల్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసేందుకు కేంద్రప్రభుత్వం బాధ్యత తీసుకోవాలంది.

విభజన హామీలకు సంబంధించి 11 ప్రధాన అంశాలు, 15 పాయింట్లపై సుదీర్ఘంగా చర్చించి, అందుబాటులోని సమాచారం ప్రకారం గణించదగ్గ 7

| ఏపీకి రావాల్సిన నిధులు (రూ. కోట్లలో) (జేఎఫ్‌సీ నివేదిక ప్రకారం) | | | |
|---|---|---|---|
| అంశం | ఎంత రావాలి | వచ్చింది లేదా ఇస్తామన్నది | ఇంకా రావాల్సింది |
| కేంద్ర ప్రాయోజిత పథకాలు | 16,447 | 0 | 16,447 |
| రెవెన్యూలోటు | 14,333 | 4,118 | 10,225 |
| వెనుకబడిన ప్రాంతాలకు | 24,350 | 2,100 | 22,250 |
| పన్నుల రాబడి లోటు | 3,820 | 0 | 3,820 |
| విశాఖ-చెన్నై కారిడార్ | 6,000 | 0 | 6,000 |
| కాకినాడ పెట్రో కాంప్లెక్స్ | 5,000 | 0 | 5,000 |
| జాతీయ ప్రాధాన్య సంస్థలు | 11,673 | 853 | 10,800 |
| (ఇందులో పోలవరం నిధులను, ప్రత్యేక హోదా ద్వారా రావాల్సిన పన్ను రాయితీలు తదితర మొత్తాలను చేర్చలేదు) | | | |

అంశాలపై జేఎఫ్‌సీ రూపొందించిన నివేదికను పవన్ కళ్యాణ్, నిజనిర్ధారణ బృందం పద్మనాభయ్య, ఐవైఆర్ కృష్ణారావు, తోట చంద్రశేఖర్, ఉండవల్లి అరుణ్ కుమార్, జేపీ హైదరాబాద్‌లో విడుదల చేశారు. ప్రధానమంత్రి మోదీకి కూడా నివేదికను పంపుతున్నట్టు ప్రకటించారు. నివేదికలోని ఇతర ముఖ్యాంశాలు:

- 14వ ఆర్థిక సంఘం ప్రత్యేకహోదా అనేది రద్దు చేయాలని సిఫార్సు చేసినట్టు ఎన్డీయే ప్రభుత్వం చెబుతున్నా ఆ విషయం ఆర్థికసంఘం నివేదికలో లేదు.
- కేంద్ర ఆర్థికమంత్రి సూచన మేరకు ఏపీ అంగీకరించిన ప్రత్యేక ప్యాకేజీలో కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రూ.16,447 కోట్లను ఇస్తామని తెలిపారు. కానీ ఇప్పటి వరకూ ఏమీ చెల్లించలేదు.
- అకౌంటెంట్ జనరల్ అంచనా ప్రకారం రాష్ట్రానికి 2014-15లో ఆదాయలోటు రూ.16,078 కోట్లు ఉంది. కానీ కేంద్రం ఈలోటు కొత్తపథకాల వల్ల వచ్చిందని, నికరంగా రూ.4117.89 కోట్లు లోటు మాత్రమే ఉందని చెబుతూ, అందులోనూ రూ.3979.50 కోట్లు మాత్రమే ఇచ్చింది.

  అగ్రికల్చర్ రిడంప్షన్ (రూ.3068.35 కోట్లు), రైతు సాధికార సంస్థ (రూ.4001.32 కోట్లు), డిస్కం పునర్వ్యవస్థీకరణ (రూ.1500 కోట్లు), వృద్ధాప్య పింఛన్లు (రూ.3391.20 కోట్లు) కలిపి 2014-15 సంవత్సరానికి రాష్ట్రం మొత్తం రూ.16,078.76 కోట్ల రెవెన్యూ లోటును ఎదుర్కొంటోంది. కానీ.. ఆయా పథకాలు/ నిర్ణయాలు విభజన తర్వాత తీసుకున్నారంటూ కేంద్రం వాటిని పరిగణలోకి తీసుకోలేదు. కేంద్ర వాదన అసంబద్ధమని, పైన ఉటంకించినవన్నీ పాతపథకాలేనని, కొత్తగా పెరుగుదల లేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా కేంద్రం పట్టించుకోలేదు. ఉద్యోగుల వేతన సవరణ కారణంగా పడిన భారం రూ.5325 కోట్లను కూడా ఆర్థిక లోటుగా పరిగణించాలన్న రాష్ట్రం అభ్యర్థనను కూడా కేంద్రం తోసిపుచ్చింది. ఇది తగదు. డిస్కంలు, వృద్ధాప్య పింఛన్లు, ఉద్యోగుల వేతన సవరణ బకాయిల వల్ల రాష్ట్రంపై పడిన భారం మొత్తాన్నీ కేంద్ర ప్రభుత్వమే భరించాలి.
- రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని ఇస్తామని అప్పటి ప్రధాని డా॥ మన్మోహన్‌సింగ్ పార్లమెంటులో ప్రకటించారు. రూ.24,350 కోట్ల విలువైన ప్రత్యేకాభివృద్ధి ప్యాకేజీని మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం 2015 జనవరిలో నీతి ఆయోగ్‌కు ప్రతిపాదనలు పంపింది. వీటిపై కేంద్రం నుంచి స్పందనే లేదు. ఏడు వెనకబడిన జిల్లాలకు రూ.50కోట్లు చొప్పున రూ.350 కోట్లను మూడేళ్లు ఇచ్చారు. రాబోయే సంవత్సరాల్లో మరో 1050 కోట్లను ఇస్తామంటున్నారు. కానీ.. మొత్తం బుందేల్‌ఖండ్ ప్యాకేజీని అమలు చేయాలి.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం ఆస్తుల్లో 95 శాతం తెలంగాణకు (ఇవి హైదరాబాద్‌లో ఉండటంతో) దక్కాయి. దీనివల్ల కనీసం 2020 వరకు నూతన ఏపీ రెవెన్యూలోటును ఎదుర్కోనుంది. దేశంలో ఒక్క ఏపీ మాత్రమే ఈ దయనీయ స్థితిలో ఉంటుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య ఆస్తుల పంపకానికి ఉద్దేశించిన కమిటీ తన పని పూర్తిచేసేందుకు చాలాకాలం పట్టేలా ఉంది. దీనివల్ల ఏపీకి ఎంతో అన్యాయం జరుగుతోంది.
- రాజధాని అమరావతి నిర్మాణం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ నత్తనడకన సాగుతున్నాయి. ప్రకటించిన నాలుగేళ్లయినా డిజైన్లు, అంచనాలు, డీపీఆర్‌ల తయారీలో రాష్ట్రం వెనకబడి ఉంది. రాజధాని నిర్మాణానికి లక్షల కోట్లు

# హోదాతోనే న్యాయం: పవన్

ప్రత్యేక హోదాకు ఏదీ సరిపోదని, రాష్ట్రానికి వందశాతం న్యాయం హోదా ద్వారానే సాధ్యమవుతుందని పవన్ కళ్యాణ్ అన్నారు. హోదాపై కొండంత ఆశ చూపిన కేంద్రం.. ప్యాకేజీని ప్రకటించిందని, ఆ పాచిపోయిన లడ్డూలనైనా తీసుకుంటామని తెదేపా నేతలు అన్నారని, ఇప్పుడు అవి కూడా రాలేదని అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకసారి హోదా, ఇంకోసారి ప్యాకేజీ, మరోసారి హోదా అంటూ గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. ఏపీలో రైల్వేజోన్ వయబుల్ కాదంటున్న కేంద్రం.. రాంవిలాస్ పాశ్వాన్ అడిగితే హాజీపూర్‌లో జోన్‌ని ఎలా ఏర్పాటు చేసిందన్నారు. కోర్టులు, ప్రభుత్వాల మాదిరి సుదీర్ఘ సమయం తీసుకుని రిపోర్టు ఇవ్వటం వల్ల ఉపయోగం ఉండదని తాము వేగంగా ఉన్న పరిధిలోనే స్పష్టతనిచ్చే నివేదికను రూపొందించామని జేపీ తెలిపారు. అభిప్రాయాలు ఎన్నున్నా నిజాలు ఒకటేనన్నారు. కేంద్రం నుంచి ఏపీకి రూ.74,542 కోట్లు రావాల్సుందన్నారు. అయితే కేంద్రం లెక్కలు ఇంకా ఇవ్వనందున కొన్ని అంశాల్లో ఈ నివేదిక పరిపూర్ణం కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్న విషయాల్లో కచ్చితంగా ఖండించదగ్గ విషయాలున్నాయన్నారు. హోదాకు ప్యాకేజీ ప్రత్యామ్నాయం కాదన్నారు. హోదాపై రకరకాల మాటలు మాట్లాడుతున్నారని, కానీ పారిశ్రామిక పన్ను రాయితీలు హోదాలో భాగమేనని, హోదా ఉన్న 11 రాష్ట్రాల్లో ఏదోకరూపంలో ఇవి అమలవుతున్నాయని అన్నారు. నివేదిక రూపకల్పనకు పార్టీలకతీతంగా చొరవ చూపిన పవన్ కళ్యాణ్‌ను, ప్రతిదీ క్షుణ్ణంగా పరిశీలించిన పద్మనాభయ్యను, పాలుపంచుకున్న ఐవైఆర్ కృష్ణారావు, చంద్రశేఖర్, ఉండవల్లిలను, పరోక్షంగా సహకరించిన ఇతర పెద్దలు, మిత్రులను జేపీ అభినందించారు.

కాకపోయినా, పదుల కోట్ల నిధుల్ని కేంద్రం కేటాయించాలి.

- రాష్ట్రాభివృద్ధికి గణనీయంగా తోడ్పడే 5 కీలక రహదారి ప్రాజెక్టులను రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించింది. మరోపక్క కేంద్ర రవాణా శాఖామంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్రంలోని హైవేల అభివృద్ధికి రూ.72,000 కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించినా.. పై ఐదు ప్రాజెక్టులు అందులో లేవు. 180 కిలోమీటర్ల పొడవైన, రూ.20,000 కోట్ల విలువైన అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టు డీపీఆర్‌ను మాత్రమే ఎన్‌హెచ్ఏఐ రూపొందిస్తోంది.
- విజయవాడ-అమరావతి-గుంటూరుల మధ్య 106.56 కిలోమీటర్ల పొడవైన నూతన రైల్వే లైన్‌ను కేంద్ర రైల్వే మంత్రి ఈ ఏడాది జనవరి 16న ప్రకటించారు. దీని సర్వే, డీపీఆర్ తయారీ కోసం రూ.3272 కోట్లు అవసరంకాగా, 2017-18, 2018-19 బడ్జెట్లలో రూ.10కోట్ల చొప్పున మాత్రమే కేటాయించారు. నూతన మెట్రో విధానం ప్రకారం విజయవాడ మెట్రో ప్రాజెక్టును లైట్‌మెట్రోగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌ను సిద్ధం చేస్తుండగా, విశాఖపట్నం మెట్రోపై మాత్రం రాష్ట్ర అభిప్రాయం ఇంకా స్పష్టంగా తెలియడం లేదు.
- నాలుగు నోడ్స్‌తో కూడిన విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ఒక్కొక్కదానికి రూ.3,000 కోట్ల చొప్పున మొత్తం 12,000 కోట్లు అవసరం. అయితే విశాఖపట్నం, చిత్తూరు నోడ్స్‌కు మాత్రమే ప్రాధాన్యతనిస్తున్నందున వాటికైనా రూ.6వేల కోట్లు ఇవ్వాలి. ఈ ప్రతిపాదననూ కేంద్రం పెండింగ్‌లో ఉంచింది.
- కడపలో స్టీల్‌ప్లాంట్‌కు అనుకూలంగా మెకాన్ సంస్థ ఇచ్చిన నివేదికను కేంద్రం ఆమోదించాలి. దుగ్గరాజపట్నం పోర్ట్ సాధ్యం కాదని నీతి ఆయోగ్ చెప్పింది. వాస్తవానికి విభజన కంటే ముందే ఏపీలో ఓ పోర్టు ఏర్పాటవ్వాల్సి ఉంది. ఏదో కొత్తగా ఇస్తున్నట్టు విభజనచట్టంలో చేర్చారు. కేంద్రం సూచన మేరకు దుగ్గరాజపట్నానికి రాష్ట్రం ప్రత్యామ్నాయం చూపాలి. విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రం నానుస్తోంది. ఇప్పటికైనా ప్రజాభిప్రాయం మేరకు రైల్వే జోన్‌ను ప్రకటించాలి.
- విభజన చట్టంలో పొందుపరిచిన మేరకు పన్నుల వసూళ్లలో ఏపీకి తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఏపీలో కార్యకలాపాలు సాగించే పలు సంస్థల ప్రధాన కార్యాలయాలు హైదరాబాద్‌లో ఉండటంతో అవి చెల్లించే పన్నులు తెలంగాణకే చెందుతున్నాయి. ఈరకంగా ఏపీ రూ.3,850 కోట్ల దాకా నష్టపోయింది. ఈ నష్టాన్ని కేంద్రమే భర్తీ చేయాలి.
- కేంద్రం ఇచ్చిన నిధులకు రాష్ట్ర ప్రభుత్వం యు.సి.లను (వినియోగ ధృవీకరణ పత్రాల్ని) ఇవ్వాలి. తద్వారా మరిన్ని నిధుల్ని పొందే వీలుంది.
- తెలంగాణకు ఇచ్చిన హామీల్లో కూడా అత్యధికం నేటికీ కార్యరూపం దాల్చలేదు. వాటిని కూడా సత్వరమే అమలుపరిచేందుకు కేంద్రం రోడ్‌మ్యాప్‌ను ప్రకటించాలి.

# న్యూ ఇండియా @ 2022.. పాత ఆలోచనలతోనా?

పంచ్ డైలాగులు, చిట్టి పొట్టి పదాలు, ఆకర్షణీయ నినాదాలు.. అనగానే ఓ లెవెల్లో గుర్తొచ్చే ఇమేజ్ ప్రధానమంత్రి నరేంద్రమోదీ! గత మూడున్నరేళ్లలో మోదీ చెప్పిన 34 కొటేషన్లు.. అంటూ కథనాలు కూడా వెలువడ్డాయి. అయితే, మోదీ చాలా హామీల్లాగే ఆయన కొటేషన్లు కూడా లోతైన ఆలోచన కార్యాచరణ లేకుండా తళుకుల్లా మిగిలి పోతుండటంతో.. క్రమంగా మన మెదళ్లు కూడా కనెక్ట్ కావటం తగ్గించాయి. త్రిపుర సహా పలు ఈశాన్య రాష్ట్రాల్లో మోదీ పార్టీ విజయం సాధించినా- ఏదో వన్‌డే ఎగ్జయిటింగ్ ఈవెంట్‌లాగే అనిపిస్తోంది. అయితే ఉత్తర ప్రదేశ్ ఎన్నికల్లో గెలిచాక 2017లో ఆయన తన ప్రసంగంలో ప్రకటించిన 'న్యూ ఇండియా' నినాదం మాత్రం కొంత ఆసక్తిని పెంచుతోంది. నెలకో కొత్త నినాదంలా కాకుండా.. న్యూ ఇండియా గురించి దాటవేయకుండా వీలైనన్ని సందర్భాల్లో చెప్పటానికి మోదీ ప్రయత్నిస్తుండటం వల్ల కొంత సీరియస్‌నెస్ ఉందేమోనన్న ఆశ కలుగుతోంది. న్యూ ఇండియాకు మోదీ పెట్టిన గడువు 2022 (దేశ 75వ స్వాతంత్ర్యదినోత్సవం)ను చేరుకోవాలంటే ఆయన పార్టీ 2019 ఎన్నికల్లో గెలిచి మూడేళ్లు అధికారంలో ఉండాల్సిన అవసరం ఉంది. ఆ రకంగా ఎన్నికల కోసమే ఈ నినాదాన్ని ఎత్తుకున్నారనుకున్నా.. నవభారతం కోసం ప్రయత్నం స్వాగతించదగ్గదే అనటంలో సందేహం లేదు.




పేదరికం, అవినీతి, కులం, మతం, ఉగ్రవాదా లను నిర్మూలించిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దటమే న్యూ ఇండియా ప్రధాన లక్ష్యమని మోదీ చెబుతున్నారు. 2017 ఆగస్టు 15న ఎర్రకోట మీద ప్రసంగంలో కూడా మోదీ నవీన భారతం గురించే చెప్పుకొచ్చారు. ఆ తర్వాత నీతి ఆయోగ్ సమావేశంలో, పలు కార్యక్రమాల్లో ఇదే అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. హ్యాష్‌ట్యాగ్ ప్రచారాలు నిర్వహించారు. ఇటీవల సూరత్‌లో 'రన్ ఫర్ న్యూ ఇండియా' పేరుతో ఏర్పాటు చేసిన మారథాన్‌ను కూడా ప్రధాని ప్రారంభించారు. మోదీ పాలన నిజంగా న్యూ ఇండియాను ఆవిష్కరించగలదను కుంటే, ఆయనకు అధికారం తిరిగి కట్టబెట్టటానికి మనకేం అభ్యంతరం ఉండాల్సిన పన్లేదు. కానీ ఆయన విధానాలు, ఆయా రంగాల్లో ఆచరణ న్యూ ఇండియా దిశగా ఉన్నాయా? అన్నది అసలైన సందేహం.

న్యూ ఇండియా టార్గెట్‌లోని అవినీతి అంశాన్నే తీసుకుంటే..

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే ప్రభుత్వం వరుస కుంభకోణాల్లో కూరుకుపోవటమే మోదీకి ఢిల్లీ పీఠం దిశగా మహదవకాశాన్నిచ్చింది. ముఖ్యంగా స్వతంత్ర భారత చరిత్రలోనే అతి పెద్ద కుంభకోణంగా పేరు మోసిన 2జీ స్పెక్ట్రం కేటాయింపుల కేసు నేపథ్యంలో.. 2011-12లో అరవింద్ కేజ్రీవాల్, కిరణ్‌బేడీలతో కూడిన అన్నా హజారే బృందం ఇండియా ఎగనెస్ట్ కరప్షన్ అంటూ యువభారతంలో రగిల్చిన ఆవేశాన్ని, లోక్‌సత్తా, పౌరసమాజ ప్రముఖులు చేసిన ప్రచార, న్యాయపోరాటాల్ని మోదీ రాజకీయంగా చక్కగా వినియోగించుకున్నారు. అవినీతి లేని పాలన, అభివృద్ధి, సామరస్యత వంటి నినాదాలతో పట్టణ ఓటర్లను బాగా ఆకట్టుకున్నారు. కానీ అదే మోదీ అధికారంలోకి వచ్చాక.. 2జీ స్పెక్ట్రం కేసు నీరుగారకుండా ఎటువంటి చర్యల్నీ తీసుకోలేకపోయారు. 2017 డిసెంబర్ 21న సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్‌లో 2జీ కేసులో ప్రధాన నిందితులైన ఎ. రాజా, కనిమోళి

### అవినీతికి చేయటానికి అవకాశాలు ఎక్కువ, ప్రజలకు మేలు చేయటానికి అధికారాలు తక్కువ

మోదీ సహకార ఫెడరలిజాన్ని గురించి చాటుకుంటున్నారుగానీ.. రాష్ట్రాలకు తగినన్ని అధికారాలు లేకపోవడం వల్ల విద్య, ఆరోగ్యం, సివిల్ సర్వీసు వ్యవస్థలు వంటి వాటిల్లో మార్పులు తెచ్చి ప్రజలకు సేవల్ని మెరుగుపరిచే అవకాశం లేకుండా పోతోంది. 1980లలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా, జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీల సారథులు ఢిల్లీ దాకా వివిధ మహానగరాల్లో సదస్సులు (కాంక్లేవ్‌లు) నిర్వహించి చేసిన కృషి వల్ల ఈ దేశంలో ఫెడరలిజం బలపడి, రాష్ట్రాలకు నిధులు పెరిగాయిగానీ, ఇంకా అధికారాలు జాతీయస్థాయి ప్రభుత్వం వద్దే కేంద్రీకృతమై ఉన్నాయి. నిజమైన పాలన రాష్ట్రాల్లో ఉంటే, కీలకాధికారాలు కేంద్రం వద్ద ఉన్నాయి. అందుకే ఫెడరలిజానికి కొత్త నిర్వచనం ఇవ్వాల్సి ఉంది. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలనివ్వాల్సి ఉంది. ఇందుకు ప్రస్తుతమున్న సహకార ఫెడరలిజం కాన్సెప్ట్ చాలదు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు అధికారాలు, నిధులు పెరగటంతోపాటు స్థానిక ప్రభుత్వాలకు కూడా నిధుల్ని సాధికారతను అందిస్తేనే ఫెడరలిజం సమగ్రతను సంతరించుకుంటుంది. ఓ గ్రామంలో ఎన్నికలు ఎలా జరపాలో కూడా భారత రాజ్యాంగంలోనే రాస్తే, ఇక ప్రజల సాధికారతకు అర్థమేంటి? ఇంతటి కేంద్రీకృత పాలన ప్రపంచంలో మరే ఫెడరల్ రాజ్యాంగ ప్రజాస్వామ్య దేశంలోనూ కన్పించదు. రాష్ట్రాల్లో పనిచేసే ఐఏఎస్ అధికారులకు సంబంధించి రాష్ట్రంలో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా కేంద్రం దయాభిక్ష మీద ఆధారపడాల్సి వస్తోంది. ముఖ్యమంత్రులకు కూడా ప్రధాని అపాయింట్‌మెంట్ దొరకని పరిస్థితిలో ఈ సమస్యలు జటిలమవుతున్నాయి. అవినీతికి, వంశపారంపర్య రాజకీయాలకు తప్ప.. ప్రజలకు నిజంగా మేలు చేయాలంటే అధికారాలు రాష్ట్రాల స్థాయిలో లేవు. ప్రజలుండేది స్థానిక ప్రభుత్వాల్లో, రాష్ట్రాల్లో తప్ప ఢిల్లీ కోటరీల్లో కాదు గదా! ఎంతటి సాంకేతికత ఉన్నా.. ఎంత దూరంలోని ప్రజల సమస్యలనైనా తాను పసిగట్టి పరిష్కరించగలనని ప్రధాని చెప్పటం న్యూ ఇండియా భావనకు విరుద్ధమైనది.

నిర్దోషులుగా విడుదలయ్యారు. గత పాలకుల అవినీతిపై అంత స్థాయిలో విరుచుకుపడ్డ మోదీ.. దోషులకు శిక్ష పడేలా దర్యాప్తును సాగించేందుకు నేరపరిశోధనా సంస్థల్ని తిరుగులేని ప్రధాని హోదాలో ఉండి కూడా ఏమాత్రం బలోపేతం చేయలేకపోయారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్య ప్రజలు రోజువారీ సేవలకు లంచాల బారిన పడకుండా లోక్‌సత్తా రూపొందించిన 'పౌర సేవల' చట్టం పార్లమెంట్ వద్దే పెండింగ్‌లో ఉన్నా ఆమోదానికి కనీస ప్రయత్నం చేయలేదు. అప్పుడప్పుడూ మాటలు, అరుదుగా కొంతమంది ఉన్నతాధికారుల మీద చర్యలు మినహా ప్రభుత్వ కార్యాలయాల ప్రక్షాళనకు ఆయన చేసిందేమీ లేదు. పైగా.. గతిలేక ఓ సర్టిఫికెట్ కోసం రూ.100 లంచం ఇచ్చే పౌరులకు 3 నుంచి 7ఏళ్ల జైలుశిక్ష, అవినీతికి పాల్పడ్డ ప్రభుత్వాధికారులను కనీసం అరెస్టు చేయటానికి కూడా ప్రభుత్వ ముందస్తు అనుమతి కావాలని అవినీతి నిరోధక చట్టానికి సవరణను ప్రతిపాదించారు. 2018 వరకూ లోక్‌పాల్ నియామకమే చేయలేదు. దేశంలో ప్రత్యర్థిగా బలహీనమైన కాంగ్రెస్ ఉంటేనే బీజేపీకి లాభమనే ఉద్దేశంతో.. రాబర్ట్ వాద్రాపై ఉన్న భూఅక్రమాల కేసులు, సోనియా, రాహుల్ గాంధీలపై ఉన్న 'నేషనల్ హెరాల్డ్' కేసుల విషయంలో ఉద్దేశపూర్వకంగానే ఉదాసీనంగా వ్యవహరించారని, రాజకీయంగా అవసరమనుకున్నప్పుడే కేసులు, విచారణలు జరుగుతున్నాయని, ఈ విషయంలో గత పాలకులకు మోదీకి తేడా ఏమీ లేదని తీవ్ర ఆరోపణలే వినవస్తున్నాయి. బ్యాంకుల ద్వారా ప్రజల సొమ్మును కొల్లగొట్టిన నేరస్తులు దర్జాగా దేశం విడిచి పోతూనే ఉన్నారు. అవినీతిని, నల్లధనాన్ని అంతం చేయటానికంటూ ప్రయోగించిన డీమానిటైజేషన్ (పెద్ద నోట్ల రద్దు) బీజేపీకి, కొందరు అవినీతి అధికారులు, నేతలకు లబ్ధి చేకూర్చిందిగానీ, కోట్లాది ప్రజలకు కష్టాల్నే మిగిల్చింది. నోట్ల రద్దు కేవలం ఓ సంకేతం మాత్రమేనని, నిజంగా అవినీతి పోవాలంటే రియల్ ఎస్టేట్ రంగంలో స్టాంప్ డ్యూటీ తగ్గింపు, భూముల ధరల్ని మార్కెట్ రేటుకు సమానం చేయటం (దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం కూడా తగ్గదు) వంటి చర్యలతోపాటు అవినీతిపరుల ఆస్తుల జప్తు, ముఖ్య మంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి వంటి చర్యలు తీసుకోవాలని, ఇవి బీజేపీకి రాజకీయంగా కూడా మేలు చేస్తాయని లోక్‌సత్తా చెప్పినా మోదీ ప్రభుత్వం చొరవ చూపలేదు. ఫలితంగానే, 2018లో ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ విడుదల చేసిన అంతర్జాతీయ సర్వేలో భారత్ అవినీతిలో 81వ స్థానంలో ఉంది. దేశాన్ని మార్చేస్తానంటూ మోదీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయ్యాక.. ఇండియాలో అవినీతి యధాతథంగా కొనసాగుతోందని టీఐ సర్వే వెల్లడించింది. అవినీతిపై పోరు పేరుతో ఎంత పైపై రాజకీయం, పాలన సాగుతున్నాయో తేటతెల్లం

**ఈ జనానికి చిన్న మార్పులు చాలనే ప్రమాదకర ఆలోచనాధోరణి వల్లే..**

స్వతంత్రం వచ్చిన తర్వాత దశాబ్దాలపాటు కాంగ్రెస్ నేతలు ఏం చెప్పినా చెలామణి అయిందని, జ్యుడీషియరీ సహా దేశంలో సమూల మార్పుల్ని తెచ్చే గొప్ప అవకాశాన్ని కాంగ్రెస్‌వారు జారవిడిచారని ఇటీవల లోక్‌సభలో మోదీ ఉపన్యాసమిచ్చారు. కాంగ్రెస్‌వారు కొన్ని అద్భుతావకాశాల్ని జారవిడిచిన మాట నిజమేగానీ, దేశానికి నష్టం చేసింది అంతకంటే ప్రమాదకరమైన మరో ఆలోచనా తీరు. దాన్ని కాంగ్రెస్‌తోపాటు ప్రస్తుతం మోదీ పార్టీ, వివిధ రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు, కొంతమేర పౌరసమాజం కూడా కొనసాగిస్తూనే ఉన్నాయి. రోజువారీ ఫైళ్ల మీద సంతకం పెట్టటం, నిన్నటి కంటే ఈవేళ్టిని కొంత మెరుగుపరిచేందుకు ప్రయత్నించటం మినహా ఈ దేశానికున్న వనరులు, ప్రజలకున్న సామర్థ్యాన్ని అంచనా వేసి సాధించగలిగే అవకాశమున్న పూర్తిస్థాయి మార్పును తేవటానికి మనస్ఫూర్తిగా ఇంతవరకూ ఏ నాయత్వమూ ప్రయత్నించిన దాఖలా స్వతంత్ర భారతదేశంలో లేదు. ఆచరణాత్మకంగా పెద్ద మార్పులు సాధ్యమయ్యే అవకాశమున్నా కూడా.. ఈ జనానికి చిన్న చిన్న మార్పులు చాలు అనే ధోరణిని కాంగ్రెస్ అనుసరించటం, ప్రస్తుతం మోదీ, ఇతర పార్టీలూ అనుసరిస్తుండటం ఈ దేశానికి పెద్ద శాపం అనటంలో సందేహం లేదు. అందుకే న్యూ ఇండియా విషయంలో పైపైన మాట్లాడటం, వైరుధ్యాలతో వ్యవహరించటం, సాధారణ మార్పులకే అసాధారణ ప్రచారం చేసుకోవటం వంటివి వీడి మోదీ స్పష్టమైన కార్యాచరణతో నవీన భారతం దిశగా చర్యలు తీసుకోవటం అవసరం.

చేసిన తాజా పరిణామమిది.

అలాగే న్యూ ఇండియా పేరుతో మోదీ చెప్పిన ఇంకొన్ని కీలకాంశాలు– పేదరికం, కులం పోవటం! నవభారత దేశ లక్ష్యాల్లో భాగమైన పేదరికాన్ని, కులాన్ని పోగొట్టాలంటే ప్రధానంగా ప్రజలకు అందించాల్సింది– నాణ్యమైన పాఠశాల చదువు, మంచి ఆరోగ్యం. ఈ రెండు రంగాల్లో భారతదేశ రికార్డును చూసి ఇటీవల బిల్‌గేట్స్ జడుసుకున్నారు. ఈ కీలక రంగాల పట్ల ఇంత నిర్లక్ష్యం చూపే ఏ దేశమూ సుస్థిరమైన అభివృద్ధిని సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు. విద్యకు పునాది అయిన పాఠశాలల్లో అభ్యసనా ప్రమాణాలపై హైస్కూలు విద్యార్థుల మధ్య ప్రపంచ వ్యాప్తంగా 74 దేశాలలో సర్వే చేస్తే మనదేశం 73వ స్థానంలో ఉంది. ఈ సర్వే 2009లో జరిగింది. ఆ తర్వాత ఆ సర్వే (పీసా)లో పాల్గొనబోమని భారత్ పలాయనం చిత్తగించటంతో ఇతర దేశాలతో పోల్చి చూస్తే మనదేశంలో చదువులు ఎలా ఉన్నాయో తాజా వివరాలు లేకుండా పోయాయి. కానీ ఆ అంతర్జాతీయ సర్వే కంటే కాస్త పైపై ప్రశ్నలతో చేసే 'అసర్' వంటి దేశీయ సర్వేల్ని చూసినా మన విద్యావ్యవస్థ అధ్వాన్నంగా ఉందనే ఏటేటా తేలుతోంది. మోదీ ప్రభుత్వ హయాంలోనూ ఈ మౌలికరంగంలో ఘోరమైన పరిస్థితి కొనసాగుతూనే ఉంది. విద్యా హక్కు చట్టాన్ని తెచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య తగ్గుతుంటే, ప్రయివేటు పాఠశాలల్లో చేరేవారి సంఖ్య పెరుగుతోంది. విద్యాహక్కు చట్టం వచ్చినప్పుడు బడిలో చేరి యుక్తవయస్కులైన వారితో సహా 14–18ఏళ్ల వయస్కుల విద్యాప్రమాణాల మీద 'అసర్' జరిపిన తాజా సర్వేలో 25శాతం మంది మాతృభాషలోని అంశాలనే చదవలేకపోతున్నారు, 40శాతంమంది గడియారం చూసి సమయం చెప్పలేకపోతున్నారు. మ్యాప్‌లో తమ రాష్ట్రాన్ని గుర్తించలేనివాళ్లూ పెద్దసంఖ్యలో ఉన్నారు. అయినా విద్యాహక్కు చట్టాన్ని సరిచేసే ప్రయత్నాన్ని మోదీ ప్రభుత్వం చేయలేదు. సవరణల కోసం రాష్ట్రాలు పంపిన ప్రతిపాదనల్ని కూడా పరిశీలించే తీరికలేకుండా కేంద్ర పాలకులు వ్యవహరిస్తున్నారు. ఇక ఆరోగ్యంలో.. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ వైద్యం చదివేరోజుల్లో ఏ సమస్యలున్నాయో అవే సమస్యలు ఈవేళ్టికీ ఆ రంగంలో కొనసాగుతున్నాయి. వైద్యఖర్చులు భరించలేక ఏడాదికి 6 కోట్ల 40 లక్షలమంది పేదలుగా మారుతున్నారు. ఈ పరిస్థితికి మోదీయే కారణమని నిందించలేంగానీ, దీన్ని మార్చేందుకు ఆయన ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేయటం లేదని చెప్పటానికి సంకోచించనక్కర్లేదు. వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు బ్రిటన్ తరహాలో సార్వత్రిక ఆరోగ్య పథకాన్ని అమలుచేయటానికి మన బడ్జెట్ పరిధిలోనే నమూనాను లోక్‌సత్తా అందజేసినా పాలకులు అరకొరగానే స్పందిస్తున్నారు. మోదీ కేర్ అనే పబ్లిసిటీతో ప్రారంభించిన 2018–19 బడ్జెట్‌లోని జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకమే ఇందుకు నిదర్శనం. ఖజానాను గుల్ల చేయటం, మహాఅయితే బీజేపీకి ఓట్లు తేవటం తప్ప ఈ పథకం వల్ల ప్రజలకు ఆరోగ్యం అందదు.

ఇక న్యూ ఇండియా లక్ష్యంలోని మరో అంశమైన మతం పేరుతో జరుగుతున్న వాక్, భౌతిక దాడులను అరికట్టేందుకు

**'ఇస్రో'లా ఇతర ప్రభుత్వ సంస్థలు ఎందుకు పనిచేయటం లేదన్న ఆలోచన రావాలిగా!**

ఆటో ప్రయాణానికయ్యేదాని కంటే తక్కువ ఖర్చుతో కేవలం కిలోమీటర్‌కి రూ.8 వెచ్చించి భారత్ అంగారక గ్రహానికి ఉపగ్రహాన్ని పంపిందని ప్రధాని మోదీ తరచూ చెబుతుంటారు. అలాంటి విజయాల్ని వరుసగా సాధిస్తున్న ఇస్రోలాగా భారత్‌లోని ఇతర సంస్థలు ఎందుకు పనిచేయటం లేదన్న ఆలోచనను మాత్రం ఆయన చేయటం లేదు. ఇస్రోలో పాదుకున్న జవాబుదారీతనంతో కూడిన స్వతంత్ర ప్రతిపత్తి, సామర్థ్యం, పోటీతత్వాలను ఇతర రంగాలకు విస్తరించేలా అధికార వికేంద్రీకరణ వంటి చర్యలను ప్రధాని ప్రతిపాదించలేకపోతున్నారు. దేశానికి సమస్యగా తయారైన ప్రభుత్వోద్యోగ వ్యవస్థ.. ఈవెంట్ మేనేజ్‌మెంట్లలో, ఎన్నికల్లో చక్కటి సామర్థ్యాన్ని ఎలా కనబరుస్తోంది? అన్న విశ్లేషణనూ చేయటం లేదు. ఈ రకమైన పాలనా వైఫల్యమే భారత్ సుస్థిరాభివృద్ధికి అవరోధంగా ఉంది.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చట్టబద్ధపాలన కొరవడ్డా మోదీ ప్రభుత్వం సకాలంలో స్పందించలేకపోతోంది.

విదేశీ సంబంధాలలో నేపాల్ నుంచి కెనడా వరకు కొన్ని దేశాల విషయంలో అపరిపక్వత ఉన్నా, విదేశాంగశాఖా మంత్రిని ట్విట్టర్‌కే పరిమితం చేసినా.. స్థూలంగా మోదీ ప్రభుత్వం ఈ విభాగంలో ప్రభావశీలంగానే వ్యవహరిస్తోందనుకోవచ్చు. పీవీ నరసింహారావు ప్రధానిగా ప్రాచుర్యంలోకి తెచ్చిన 'లుక్ ఈస్ట్' విధానాన్ని ముందుకు తీసుకెళ్తూ, ఈ క్రమంలో ఈశాన్య రాష్ట్రాలకూ ప్రాముఖ్యతనివ్వటం హర్షించదగ్గ విషయం. విదేశీ సంబంధ బాంధవ్యాల్లో మోదీ ఉత్సాహపూరిత చొరవ వల్ల.. వాణిజ్య సంబంధాలకు అవకాశాలు పెరగటంతో పాటు, ఉగ్రవాదాన్ని కట్టడి చేయటానికి కూడా పటిష్ట వ్యూహాన్ని అనుసరించే అవకాశం భారత్‌కు లభించింది. కానీ అంతర్గత భద్రత ఆ విజయాల్ని మసకబారుస్తోంది. దేశంలో చట్టబద్ధ పాలన సక్రమంగా లేకపోవటం, అప్రజాస్వామిక మతభావాలకు, దాడులకు పాలకులే పరోక్ష ప్రోత్సాహం ఇస్తుండటం, రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు తగినంత స్వయంప్రతిపత్తి స్థాయికి ఫెడరలిజాన్ని విస్తరించక పోవటం, హింసను కేవలం ఆయుధాలతో ముడిపడిన సమస్యగా చూడటం వల్ల ఉగ్రవాదం ఇంకా చాలా ఏళ్లపాటు భారత్‌ను వెంటాడే సమస్యగానే కొనసాగే ప్రమాదం పొంచి ఉంది. కేంద్రీకృత పాలన, మతఛాందసత్వం, సాయుధ అణచివేత పట్ల మొగ్గు వల్లే.. జమ్మూ కాశ్మీర్‌లో పీడీపీతో అధికారాన్ని పంచుకుని సంక్షోభాన్ని క్రమంగానైనా శాశ్వతంగా పరిష్కరించే చారిత్రక అవకాశాన్ని మోదీ పార్టీ జార విడుచుకుంది.

న్యూ ఇండియా కాన్సెప్ట్‌లో 2022 నాటికి వ్యవసాయంలో ఆదాయం రెట్టింపు సహా పలు రంగుల కలలు కూడా ఉన్నాయి. కానీ గత నాలుగేళ్ల పాలనను, 2018 బడ్జెట్‌ను చూస్తే వ్యవసాయం పట్ల కూడా మాటల గారడీయే కనిపిస్తుంది. బడ్జెట్‌లో వ్యవసాయం గురించి పెద్ద మాటలు మాట్లాడారు తప్ప గ్రామీణ ఆర్థికవ్యవస్థను బాగుచేసే సంస్థాగత చర్యలేవీ లేవు. పప్పులు, నూనెదినుసుల ధరలు పడిపోతూ దిగుమతులు పెరిగిపోతున్నా పట్టింపు లేదు. 'ఆపరేషన్ గ్రీన్'కు మొక్కుబడి కేటాయింపులు చేశారు. వ్యవసాయంలో భారీ పెట్టుబడి పెడదామనుకునే ఔత్సాహికులను ప్రోత్సహించే ప్రయత్నమేదీ లేదు. వ్యవసాయ సంక్షోభాన్ని చాలామేర దాటవేశారు.

ఎంత సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా.. పాత ఆలోచనలు, ఇంత పేలవమైన ఆచరణతో న్యూ ఇండియా టార్గెట్లు నెరవేరే అవకాశం ఎక్కడుంటుంది? న్యూ ఇండియా ట్యాగ్‌లైన్లుగా పెట్టుకున్న.. ఎంపవరింగ్, ట్రాన్‌ఫార్మింగ్ వంటి ఉద్దేశాలు ఎలా నెరవేరతాయి?

న్యూ ఇండియాలో ప్రజలు కోరుకున్నట్టు వ్యవస్థలు పనిచేస్తాయి అని మోదీ చెప్పారు. ప్రజలు తమ కడుపు, నోరుకట్టుకుని పిల్లలకు మంచి చదువు కోసం తాపత్రయపడుతున్నారు. ఆరోగ్యం కోసం అప్పులు చేస్తూ ఆక్రోశిస్తున్నారు. గతిలేక ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కి వెళితే ఇంకెన్ని వేధింపులకు పాల్పడతారోనని గుడ్ల నీరు కుక్కుకుని బాధల్ని, అవమానాల్ని దిగమింగుతున్నారు. కోర్టుల్లో ఏళ్ల తరబడి కేసుల్ని నెట్టుకెళ్లే ఓపిక లేక అన్యాయంతో రాజీ పడుతున్నారు. అవినీతిని పోగొడతారన్న ఆశతో ఏ కాస్త వ్యక్తిగత నిజాయతీ ఉన్న నాయకుడినైనా గెలిపిస్తున్నారు. మరి ప్రజల ఆకాంక్షలను వ్యవస్థలు ఏమేరకు నెరవేరుస్తున్నాయి? అందుకు తగ్గ మార్పుల్ని వ్యవస్థల్లో ఏం చేస్తున్నారు?

మంచి ఇంజిన్, సమర్థుడైన డ్రైవర్ ఉన్నా ట్రాక్ సరిగాలేనంత వరకూ రైలు ప్రయాణం సరిగా జరగదు. అలాగే

మనదేశానికి సరైన దిశామార్గం లేకపోవటం వల్ల అధికారంలో ఎవరున్నా జనం జీవితాల్లో రావాల్సిన స్థాయి మార్పులు రావటం లేదు. ప్రపంచంలోని అనేకదేశాలలో చాలా సాధారణంగా జరిగే పనులు కూడా మనదేశంలో జరగటానికి విపరీతంగా శ్రమించాల్సి వస్తోంది. ఏళ్ల తరబడి సమయం పడుతోంది. వనరులు, నాయకత్వంతో పాటుగా విధానాలకు, వ్యవస్థల నిర్మాణానికి మనం ప్రాధాన్యత ఇచ్చినప్పుడే మనం ఆశించిన మార్పుల్ని దేశంలో సాధించగలం. స్వచ్ఛ భారత్ లాంటి కార్యక్రమానికి ప్రభుత్వ సంకల్పం, అందరి మద్దతూ ఉన్నా అది ప్రధాని ప్రసంగానికి, టీవీ యాడ్స్‌కి పరిమితం కావటానికి కారణం సరైన ట్రాక్ లేకపోవటమే.

**కలాం కూడా చెప్పారు**

మోదీ నవీన భారతదేశాన్ని నిర్మించాలంటే తాను ప్రతిపాదించిన లక్ష్యాల్ని సాధించటానికి తగిన ట్రాక్‌ను నిర్మించటం అవసరం. న్యూ ఇండియా గురించి కొన్నేళ్ల క్రితం ప్రజల రాష్ట్రపతిగా పేరొందిన డా॥ ఏపీజే అబ్దుల్ కలాం కూడా చెప్పారు. కలాం గొప్ప ఆశావాదంతో న్యూ ఇండియా కోసం ప్రతిపాదించిన ఐదు లక్ష్యాలు.. వ్యవసాయం - ఆగ్రో ప్రాసెసింగ్, విద్య, ఆరోగ్యం, సమాచారం-సాంకేతికత, మౌలిక వసతులు. అందరూ కలాం కలలకు మద్దతుగా నిలుస్తున్నా, అవి నెరవేరటానికి కూడా ఆ ట్రాక్ నిర్మాణం లేకపోవటమే అవరోధం. ఈ నేపథ్యంలోనే.. రెండు దశాబ్దాలకుపై లోక్‌సత్తా చేస్తున్న కృషి మొత్తం ఈ దేశానికి సరైన ట్రాక్‌ల నిర్మాణమే.

కీర్తి ఎవరికి దక్కుతుంది అని కాకుండా భారత్‌లో ప్రజల చుట్టూ పాలనను అందించే వ్యవస్థల నిర్మాణం లక్ష్యంగా అధికారం, హింస, కల్లోల విప్లవాలు లేకుండా లోక్‌సత్తా




చేసిన కృషి గత 20-30 ఏళ్లలో ప్రపంచంలోనే ఎవరూ సాధించని అద్భుత విజయాలను సాధించింది, మన ప్రజాస్వామ్యం స్పందించే శక్తితో ఉన్నందున మార్పులు సాధించటం సాధ్యం అని నిరూపించింది. కానీ సాధించాల్సినదానితో పోలిస్తే లోక్‌సత్తా సాధించింది చాలా తక్కువ కావటమే సమస్య. ఓట్లు, సీట్లు, అధికారం పొందుతున్నవారు కూడా కలిసివస్తే.. కొండలా ఉన్న సాధించాల్సిన లక్ష్యం అలవోకగా పూర్తయి ఈ దేశంలో ప్రతి బిడ్డకూ వివక్ష లేకుండా ఎదిగే అవకాశాలు లభిస్తాయి, నివారించదగ్గ బాధల నుంచి కోట్లాదిమంది విముక్తిని పొందుతారు. మోదీ న్యూ ఇండియా లక్ష్యం కూడా నెరవేరుతుంది.

ఈ నేపథ్యంలో న్యూ ఇండియా లక్ష్యాల (ఆ మాటకొస్తే ప్రజల జీవితాలను మారుస్తామంటూ తెలుగు రాష్ట్రాల్లో సహా పలువురు ముఖ్యమంత్రులు చూపుతున్న ఆశల) సాధన కోసం 10 విధానాల ఫార్ములాను రాజకీయ వ్యవస్థకు, ప్రజలకు, ముఖ్యంగా యువతకు లోక్‌సత్తా ప్రతిపాదిస్తోంది. ఇందులో కొన్ని కొత్త అంశాలు. కొన్నేమో ఇప్పటివరకూ మోదీ, ఇతర పాలకులు అనుసరిస్తున్న విధానాల్లో మౌలిక మార్పులు. వీటిపై స్పందించే వరకూ రాజకీయ వ్యవస్థ మీద వివిధ రూపాల్లో ఒత్తిడిని పెంచటం మనందరి బాధ్యత.

1) పౌర సేవల చట్టం తేవటం: ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు కావలసి ధ్రువపత్రాలు, ఎఫ్ఐఆర్ నమోదు, నీటి, విద్యుత్ కనెక్షన్లు, భూ రికార్డులు వంటి సేవలను హక్కుగా, గౌరవప్రదమైన రీతిలో, నిర్ణీత గడువులోగా సేవలందించేందుకు 'పౌర సేవల' (సర్వీస్ గ్యారంటీ) చట్టం తేవాలి. గడువులోగా సేవలందించకపోతే రోజుకు కనీసం రూ.250 జరిమానాగా దరఖాస్తుదారునికి చెల్లించాలి.

2) చట్టం, న్యాయం అందరికీ సమానంగా అందించటం: మనదేశంలో ప్రముఖులుగా చెలామణి అవుతున్న వారిపై కేసుల్ని నీరుగార్చేస్తున్నారు. చట్టం అందరికీ సమానంగా ఉండకపోతే తలెత్తే ప్రమాదాల్ని గుర్తించాలి. శాంతిభద్రతల విభాగం నుంచి నేర దర్యాప్తు విభాగాన్ని వేరుచేసి జవాబుదారీతనమున్న స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలి. కేసులు స్థానికంగానే వేగంగా, తక్కువ ఖర్చుతో పరిష్కారమయ్యేలా 10,000 స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేయాలి. సమర్థ జడ్జీలు వచ్చేలా అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసు (ఐజేఎస్)ను ఏర్పాటు చేయాలి. సీపీసీ, సీఆర్‌పీసీ చట్టాలను సవరించి కోర్టులలో విచారణను సులభతరం చేయాలి. దీనికయ్యే ఖర్చు జీడీపీలో కేవలం 0.25శాతం.

**ఆలంబన కోసం వెతుక్కోవాల్సిన దుస్థితిలోనే ప్రజల్ని కొనసాగిస్తున్నారు**

మనదేశంలో ఎప్పటికెయ్యది.. అనే తాత్కాలిక ఏర్పాట్లు తప్ప చెప్పుకోదగిన వ్యవస్థలు లేవన్నది అసలు సత్యం. ఎంతో పేదరికం, అవిద్య, సంక్లిష్ట భిన్నత్వం ఉన్న దేశంలో తమ ఆకాంక్షల్ని నెరవేర్చే వ్యవస్థలు లేనప్పుడు ఏదోక ఆలంబన కోసం వెతుక్కోవాల్సిన దుస్థితిలోనే ఎక్కువమంది జనం కొనసాగుతుంటారు. నోటు కోసం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం, ప్రలోభాల కోసం ఓట్లను అమ్ముకోవడం, ఎదుటివారిని దెబ్బతీసైనా తమ ప్రయోజనాలను నెరవేర్చుకోవటం వంటి ధోరణులు ప్రబలుతుంటాయి. ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్టే, తక్కువ వచ్చినవారంతా ఓడిపోయినట్టే అనే ఎన్నికల వ్యవస్థ ఆ సమస్యను ఇంకా పెంచిపోషిస్తుంది. వీటిని సరిచేయకుండా, ప్రజలకు పరిపాలన అంటే అర్థమై పాలనలో భాగస్వాములవకుండా జనం తమ ఆకాంక్షల్ని నెరవేర్చుకునే వ్యవస్థలు దేశంలో ఎలా రూపుదిద్దుకుంటాయి?

3) ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యనందించేలా పాఠశాలల్ని సంస్కరించటం: ఏ కుటుంబంలో పుట్టినా ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాల్ని అందించేలా సమూల మార్పులు. విద్యావ్యవస్థలో ఇప్పుడున్న నిధులతోనే ఈ పని చేసేయొచ్చు.

4) జేబులో నుంచి ఖర్చు లేకుండా 'ప్రాథమికం' నుంచీ అందరికీ మంచి ఆరోగ్యం: ప్రజల జేబుల్లో నుంచి రూపాయి ఖర్చు లేకుండా అందరికీ 'ప్రాథమిక స్థాయి నుంచి' మంచి ఆరోగ్యం అందించే ఏర్పాటు. ఇందుకు ఆరోగ్యరంగంలో అదనంగా జీడీపీలో 0.6 – 0.8శాతం నిధుల్ని జోడిస్తే చాలు.

5) స్థానిక ప్రభుత్వాలకు 33శాతం నిధులు: ఢిల్లీలోనో, అమరావతి, హైదరాబాద్‌లోనో తీసుకున్న ఒక నిర్ణయం ప్రజల జీవితాల్ని అల్లకల్లోలం చేయకుండా ఉండటానికి స్థానిక ప్రభుత్వాలకు వార్డు స్థాయి దాకా 33శాతం నిధులను నేరుగా బదిలీ చేయాలి.

6) రైతుకు ఆదాయంతో వ్యవసాయాన్ని పరిరక్షించటం:

- ఎ. ప్రజాపంపిణీ వ్యవస్థ స్థానంలో అవినీతికి ఆస్కారం లేని పటిష్ట ఆహార భద్రత
- బి. పప్పుదినుసులు, వంటనూనె గింజలపై దిగుమతి సుంకాలు– ఆ పంటల రైతులకు ప్రోత్సాహకాలు
- సి. వ్యవసాయ వ్యర్థాలను పరిష్కరించటం, ప్రాసెసింగ్ ద్వారా అదనపు విలువను చేకూర్చటం
- డి. రిటైల్ చెయిన్ల ద్వారా దళారీలను తొలగించటం

7) అవినీతిపరుల ఆస్తులు జప్తు, బలమైన లోకాయుక్తలు: అవినీతిపరుల ఆస్తులు జప్తు చేసే చట్టంతోపాటు రాష్ట్రాల్లో బలమైన, జవాబుదారీతనంగల లోకాయుక్తల ఏర్పాటుకు చర్యలు

8) ఎన్నికల్లో నల్లడబ్బు నిరోధానికి సంస్కరణలు: న్యూ ఇండియా లక్ష్యాల్లో జమిలి ఎన్నికలు కూడా ఒకటి. 2022 నాటికి దేశవ్యాప్తంగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను ఒకేసారి జరపాలని మోదీ భావిస్తున్నారు. కానీ అదేమీ గేమ్‌ఛేంజర్ చర్య కాదు. ఎన్నికల వ్యవస్థలోని జాడ్యాలనేమీ తొలగించలేదు.. అవినీతిపరులు, అసమర్థులు, నేరస్తులు రాజకీయాలలోకి రావటానికి మూలకారణమైన నల్లడబ్బు ఎన్నికల వ్యవస్థను మార్చటానికి రాష్ట్రాల్లో దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి మార్పుల్ని రాజకీయ ఏకాభిప్రాయ సాధనతో సాధించాలి.

9) సివిల్ సర్వీసుల సమగ్ర ప్రక్షాళన: పదవిలో కొనసాగే కాలవ్యవధిని కుదించటం, ప్రమోషన్లు బ్యాచీలవారీగా కాకుండా అర్హులకే ఇవ్వటం, సమర్థులైనవారిని పౌరసమాజం నుంచి కూడా నిర్ణీత కాలవ్యవధి వరకూ అధికారులుగా తీసుకోవటం వంటి మార్పుల్ని తేవటం

10) రాష్ట్రాలకు మరిన్ని అధికారాలనివ్వటం: పాలనను మెరుగుపరుచుకుని ప్రజలకు వేగంగా సమర్థ సేవల్ని అందించేందుకు రాష్ట్రాలకు మరిన్ని అధికారాలను ఇవ్వాలి.

ఇవన్నీ ఆచరణ సాధ్యమైనవి, ప్రభుత్వం వేగంగా చేయగలిగినవి. మౌలికంగా అనేక దేశాల అనుభవాలను అధ్యయనం చేసి భారతదేశ పరిస్థితులకనుగుణంగా లోక్‌సత్తా ప్రతిపాదించినవి, పలు సమావేశాల ద్వారా వివిధ రంగాల నిపుణులు, ఆలోచనాపరులు, పౌరసమాజ నేతలు కూడా ధృవీకరించినవి, కాలపరీక్షకు నిలబడినవి. ఈ అంశాలతో న్యూ ఇండియాకు తగిన పునాదిని వేశాక మిగిలిన అంశాలను చేపట్టి విస్తరించుకోవచ్చు. ఇవి చేయకుండా.. ఏం చెప్పినా అది కాలక్షేపమే, ఎవరు అధికారంలో ఉన్నా డొల్ల నాయకత్వమే. న్యూ ఇండియా నినాదం చేస్తూ "ఏదో నడిచిపోతోంది అన్నట్టు వ్యవహరిస్తే భారతదేశం అగ్రదేశం కాజాలదు" అని తాను చెప్పిన మాటల్ని తనకు కూడా అన్వయించుకుంటే కచ్చితంగా ఈ చర్యల్ని చేపట్టాలి. నూతన భారతదేశం గురించి కలలుగన్న కలాం సార్మకచిహ్నం నుంచి తన రాజకీయ పార్టీ 'మక్కల్ నీది మయ్యమ్'ను ప్రారంభించిన కమల్ హాసన్ దగ్గర్నుంచీ రాజకీయ వ్యవస్థ, పౌరసమాజాల్లోని వారంతా కూడా ఈ విధానాలను పబ్లిక్ డిమాండ్‌గా మార్చేందుకు ప్రయత్నించాలి. ☼

# ట్రూడో పర్యటన - జాతీయ భద్రతపై ఆందోళన

అధికారంలో ఉన్నవారు కోరు కున్నవే వార్తలవుతాయి, వారు ప్రాధాన్యతనిచ్చిన అంశాలే ప్రముఖంగా ప్రచురితమవుతాయని రుజువు చేసే మరో ఉదంతం – కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఇటీవలి భారత పర్యటన! వార్తల్ని వార్తల్లా రాయటానికి ఎంతోకొంత ప్రాధాన్యమిచ్చే ప్రముఖ పత్రికలు కూడా ట్రూడో పర్యటనను పెద్దగా పట్టించుకోలేదు. ఒకరోజైతే ఎక్కడో మూలన సింగిల్ కాలమ్‌లో ప్రచురించిందో పత్రిక. 47 ఏళ్ల ట్రూడో 2013లో కెనడాలోని లిబరల్ పార్టీకి యువ అధ్యక్షుడై 2015 ఫెడరల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో ఘనవిజయం సాధించారు. సంస్కారవంతునిగా, ఉదారవాదిగా, స్త్రీవాదిగా పేరుగాంచారు. ఇతర పెద్ద దేశాల నాయకులు వచ్చినప్పుడు ట్విట్టర్ ద్వారా, వ్యక్తిగతంగా కూడా ఆహ్వానం పలికే ప్రధాని మోదీ ట్రూడో ఇలా దేశంలోని పలుప్రాంతాలను తిరుగుతున్నా చివరి రోజు వరకూ పట్టించుకోలేదు. గుజరాత్‌లో సబర్మతీ ఆశ్రమంలో ట్రూడో కుటుంబం గడిపిన సందర్భంలోనూ మోదీ కన్నెత్తి చూడలేదు. వారు తాజ్‌మహల్‌ను సందర్శించినప్పుడు కేవలం జిల్లా స్థాయి అధికారులే స్వాగతం పలికారు. ట్రూడో పర్యటన ముగింపు రోజున మాత్రం ఢిల్లీలో మోదీ స్వాగతం పలికారు. విదేశీ పాలకులను కావలించుకునే మోదీ, విదేశాల్లో విపరీతమైన క్రేజ్ ఉన్న జస్టిన్ ట్రూడో ఇద్దరూ ఇలా ఎందుకు వ్యవహరించారనేది రహస్యమేమీ కాదు. కెనడాలో, కొన్ని పాశ్చాత్య దేశాల్లో ఖలిస్థాన్ పేరుతో కార్యకలాపాలు జరుగుతుండటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. ఉగ్రవాదం అనే పదాల్ని ఉచ్చరించకుండా జాగ్రత్తపడుతూ.. 'రెఫరెండం 2020' పేరుతో రెండేళ్ల తర్వాత ఖలిస్థాన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ జరపాలనే కొత్త ఎత్తుగడతో ప్రచారం అక్కడ జరుగుతోంది. ఉరీలో సర్జికల్ స్ట్రయిక్స్, డోక్లాంలో సర్దుబాటు, నాగాలాండ్ ఒప్పందం.. ఇలా ప్రజలకు వెల్లడించలేని అంశాలున్నాయని దాటవేస్తున్న పాలకులు, ట్రూడో పర్యటనపై కూడా దేశ భద్రత ముసుగేసి మీడియాను శాసించగలిగారనే చెప్పాలి. కెనడాలోని భారతీయ జనాభా 13 లక్షల్లో 40శాతందాకా సిక్కులే ఉంటారు. స్వతంత్ర పోరాటకాలం నుంచీ అక్కడి సిక్కులు స్వదేశంలోని రాజకీయ కలాపాలలో చురుకైన పాత్ర పోషించటం కనిపిస్తుంది. ట్రూడో మంత్రివర్గంలో కూడా సిక్కులున్నారు. భార్య, ముగ్గురు పిల్లలతో భారత్‌లో వారంరోజులు పర్యటించిన ట్రూడో అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయాన్ని కూడా సందర్శించి సిక్కు ఆహార్యంతో సంప్రదాయాలను పాటిస్తూ ప్రార్థనలు జరిపారు.



ఇది సాధారణమేకదా, మనదేశం నుంచి ఒక రాష్ట్రం విడిపోతాను అంటే దాన్ని ప్రోత్సహిస్తున్న విదేశీ పాలకుల పట్ల మన కేంద్రప్రభుత్వం కఠినంగా ఉండదా.. అనిపించొచ్చు. కానీ విషయం అంత సీదాసాదాగా లేదు. మనదేశంలోని రాజకీయ పార్టీలు దేశ భద్రత, సమైక్యతల పట్ల ఎంత నిర్లక్ష్యంగా, తాత్కాలిక ప్రయోజనాల దృష్టితో వ్యవహరిస్తున్నాయో కాస్త లోతుగా పట్టి చూస్తే.. దిగ్భ్రాంతి కలుగక మానదు. పార్టీల ఎన్నికల అవసరాల కోసం ఒక పరిధి దాటి దిగజారితే దేశ ప్రయోజనాలు ఏమవు తాయన్న శంక కూడా లేకుండా నేతలు వ్యవహరిస్తున్నారు. ట్రూడో పర్యటనపై వార్తలు తక్కువ వచ్చినా.. మన తెలుగులోనివి సహా కొన్ని పత్రికల్లో పరిష్కారంతో కూడిన పదునైన సంపాదకీయాలు, లోతైన వ్యాసాలు వచ్చాయి. గోప్యం కంటే కూడా ప్రజలకు తెలియాల్సిన విషయాలే ఇందులో ఎక్కువ ఇమిడి ఉన్నాయని కొందరు సీనియర్ జర్నలిస్టుల రచనల్ని బట్టి తేటతెల్ల మవుతుంది.

ట్రూడో తాజా పర్యటన చుట్టూ నెలకొన్న గంభీరతను అర్థం చేసుకోవడానికి.. 2017 మార్చిలో పంజాబ్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించినప్పుడు సీనియర్ సంపాదకుడు శేఖర్ గుప్తా రాసిన ఓ వ్యాసంలోని సమాచారం మరింత విలువైనది. పంజాబ్ నూతన ముఖ్యమంత్రిగా ఎన్నికైనప్పుడు అమరీందర్‌సింగ్‌తో జరిపిన సంభాషణతో మొదలుపెట్టి ఆయన ఈ వ్యాసం రాశారు..

“అమరీందర్‌సింగ్‌తో గురువారం నాటి 'ఆఫ్ ద కఫ్' (యధాలాపం) అనే నా కొత్త సంభాషణ వేదికలో ఇటీవల మాట్లాడాను. ఆయన వ్యాఖ్యలకు సొంత పార్టీ కాంగ్రెస్ ఎలా ప్రతిస్పందించి ఉంటుందో కచ్చితంగా తెలియదు. అయితే అమరీందర్ కెనడాలోని సిక్కు మిలిటెంట్ల సానుభూతిపరులపై చేసిన వ్యాఖ్యలు మాత్రం అత్యంత సంచలనాత్మకమైనవి, పతాకశీర్షిక లకెక్కేవి. సిక్కు రిజిమెంట్ (అందులో ఆయన

పనిచేశారు) దేన్నీ లెక్క చేయకుండా చేసే దాడిలాంటి దాడి అది. అందరి ప్రశంసలను అందుకుంటున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఉదారవాద ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకించి అలాంటివే. పంజాబ్ పర్యటనకు రానున్న కెనడా రక్షణమంత్రి, ఒకప్పటి కల్నల్, ఆఫ్ఘాన్ యుద్ధ హీరో వంటివారైన హర్జిత్‌సింగ్ సజ్జన్‌కున్న "ఖలిస్థాన్ సంబంధాల" కారణంగా తాను ఆయనను కలుసుకోవడం సైతం చేయనని చెప్పారు. కెనడా ప్రభుత్వంలో ఉన్న నలుగురు సిక్కు మంత్రులూ ఖలిస్థానీ సానుభూతిపరులేనని ఆయన అన్నారు. ఇది, ఒక పంజాబీకి లేదా సైనికునికి మాత్రమే ఉండగల క్రమశిక్షణ అనీ, తాను ఆ రెండూనని వ్యాఖ్యా నించారు. ఈ "ఖలిస్థానీ కార్యకర్తల" వత్తిడి వల్లనే తనను కెనడాకు రానివ్వలేదని, ఆ దేశానికి వెళ్లి అక్కడి పంజాబీలతో మాట్లాడతానన్నారు. ట్రూడో ఉదారవాదాన్ని ప్రపంచమంతా ప్రశంసిస్తున్నట్టే తానూ మెచ్చుకుంటాననీ, కానీ కెనడాకు రానివ్వకుండా చేసి ఆయన నా భావప్రకటనా స్వేచ్ఛను ఎందుకు నిరాకరించినట్టు? అని ప్రశ్నించారు.

కెనడా ప్రభుత్వం తమ మంత్రులకు మద్దతుగా తక్షణమే స్పందించి, అమరీందర్ పర్యటనను స్వాగతించింది. అయితే ఇది అసలు కథనంలోని పిట్టకథే. సాధారణంగా ఇలాంటి విషయాల్లో ఊపిరిసలపకుండా తలమునకలయ్యే మన మీడియా అమరీందర్ సాధించిన ఈ అద్భుత దౌత్యవిజయాన్ని పట్టించు కోకపోవడానికి ఏకైక కారణం.. కొంతమేరకు ఆయన బీజేపీకి చెందినవారు కాకపోవడం, కొంతమేరకు పంజాబ్‌కు వారి దృష్టిలో ఏమంత ప్రాధాన్యం లేకపోవడమే.

సందర్భోచితంగా బీజేపీ తక్షణమే స్పందించి, అత్యున్నత జాతిహితం కోసం అమరీందర్ ప్రదర్శించిన సాహసాన్ని, ముక్కుసూటితనాన్ని స్వాగతించి, విదేశాలలోని సిక్కు రాడికల్ గ్రూపులపై ఆయన చేసిన విమర్శలకు బలాన్ని చేకూర్చి ఉంటే ఎలా ఉండేది?

### కాంగ్రెస్, బీజేపీలకు పట్టని జాతీయ భద్రతా సమస్య

ఎన్నికల్లో అమరీందర్ సింగ్‌కు ప్రధాన ప్రత్యర్థి అయిన ఆమ్ ఆద్మీ పార్టీకి సహాయపడటం కోసం విదేశాలలోని సంపన్న రాడికల్ సిక్కులు భారీసంఖ్యలో పంజాబ్‌కు రావడం ఆయనకు కచ్చితంగా ఆగ్రహం కలిగించింది. వారు "చాలావరకు కెనడా నుంచి వచ్చినవారే, కొందరు ఆస్ట్రేలియా నుంచీ వచ్చారు" అని ఆయన అన్నారు. 1984నాటి అమృత్‌సర్, ఢిల్లీ గాయాలను వారు తిరిగి రేపాలని యత్నించారు. వారి పక్షం గెలిచేట్టయితే అదే పాత భయానక చిత్రం తిరిగి ప్రదర్శిత మవుతుందనే మాట వ్యాపించింది. అమరీందర్ లేవనెత్తుతున్న సమస్య దేశభక్తుడైన ఏ భారతీయుడైనా, ప్రత్యేకించి సరిహద్దులను దాటి



విస్తరించిన ఏ జాతీయ పార్టీ అయినా లేవనెత్తాల్సిందే.

అమరీందర్ సొంత పార్టీ ఇలాంటి పరిస్థితికి తగ్గట్టుగా స్పందించలేనంతటి నిద్రమత్తులో జోగుతూ ఉండి ఉంటుంది. బహుశా ఆ గతంలోని తన సొంత పాత్ర గురించిన అపరాధ భావన సైతం దానిలో ఉండి ఉంటుందా? తన దేశం గురించి, తన గురించి ప్రశంసాత్మక ప్రభావాన్ని కలుగజేయాలని ప్రపంచనేతలతో చర్చలు జరపడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టేవారు, ప్రత్యేకించి ఈ విషయంలో అత్యంత చాతుర్యాన్ని కలిగినవారు అయిన నరేంద్ర మోదీ సైతం ఈ ఎత్తుగడను ఎలా విస్మరిస్తారు? కొత్తగా ఖలిస్థానీ తీర్థం పుచ్చుకున్న ఈ బాపతువారు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రమాదాన్ని ఆయన ఎన్నికల ప్రచారం సందర్భంగా ఎందుకు ఎండగట్టలేదు? కనీసం ఏదో ఒక సందర్భంలో ఆయన ప్రభుత్వం కెనడా ప్రభుత్వంలోని కొత్త సిక్కు మంత్రుల గత చరిత్ర గురించి ఆ దేశానికి ఎందుకు గుర్తుచేయలేదు, వారు ఖలిస్థాన్ అనే ఆ కాల్పనిక లోకం నుంచి బయటపడ్డారనే స్పష్టమైన హామీని ఎందుకు కోరలేదు?

భారత్ దృష్టిలో వారిలో కనీసం ముగ్గురి గతాలు ప్రమాదకరమైనవి. సజ్జన్ తండ్రి ప్రపంచ సిక్కు సంస్థ (డబ్ల్యూఎస్‌వో) వ్యవస్థాపకులలో ఒకరు. ఆయన ఒకప్పటి ఆఫ్ఘన్ యుద్ధవీరుడు. వాంకోవర్ కేంద్రంగా మిత్రదేశాల కూటమికి సలహాలనిచ్చే గూఢచార సమాచార సేవల సంస్థను నడిపేవారు. మరోమంత్రి నవ్‌దీప్‌సింగ్ బైన్స్. ఆయన మామ దర్శన్‌సింగ్ సైనీ నిషేధిత బబ్బర్ ఖల్సాకు అధికార ప్రతినిధిగా పనిచేసేవారు. తన గతాన్ని ఆయన ఎన్నడూ దాచుకోలేదు. మరో మంత్రి అమర్జిత్‌సింగ్ సోహీ వాస్తవానికి ఉగ్రవాద ఆరోపణలతో భారత్‌లో నిర్బంధంలో గడిపారు. తదుపరి ఆ ఆరోపణలేవీ రుజువు కాకపోవడంతో న్యాయస్థానాలు విడుదల చేశాయి. కెనడా ప్రభుత్వం ఈ విషయంలో జనాంతిక హామీలను ఇచ్చిందే తప్ప ఆ పాత ఉద్యమం గతించిపోయిందని నిర్ద్వంద్వంగా ప్రకటించలేదు. కెనడాలోని ఈ రాడికల్ శక్తుల

నుంచి తమ ప్రత్యర్థులకు నిధులు అందుతున్నా కాంగ్రెస్, బీజేపీలు ఇంతవరకు ఆందోళనను వ్యక్తం చేయకపోవడం మరింత ఆశ్చర్యకరం.

**జాతీయవాదాన్ని మోదీకి ధారాదత్తం చేసిన కాంగ్రెస్**

ఒక స్థాయిలో ఇది రాజకీయ ఆధిక్యతను సాధించే అంశం. కానీ దీనిలో ఇమిడివున్న ఒక్కొక్క అంశాన్ని విడిగా తీసుకుని లోతుగా విశ్లేషిస్తే.. మరింత ప్రగాఢమైన రాజకీయ సమస్యను సూచిస్తుంది. నేటికి దాదాపు ఒక దశాబ్దికిపైగా అమరీందర్ పార్టీ జాతీయవాద ఎజెండాను బీజేపీ ఎగరేసుకుపోవడాన్ని అనుమతించింది. అలా అని యూపీయే పాకిస్తాన్‌తో, ఉగ్రవాదులతో, చివరికి చైనాతో సైతం ఎన్నడూ మెతకగా వ్యవహరించింది లేదు. అయినా సోనియాగాంధీ కాంగ్రెస్, జాతీయ ప్రయోజనాలతో ముడిపడ్డ జటిల సమస్యల పట్ల ''మెతక''గా వ్యవహరించిందనే పేరును సమంజసంగానే తెచ్చుకుంది. ఆ రంగాన్నంతటినీ మోదీ తన సొంత భావనతో చాపలా చుట్టేసుకుపోవడానికి వదిలిపెట్టేసింది. జాతీయ ప్రయోజనాల పరిరక్షణ పేరిట మోదీ అంతర్గర్భితమైన హిందూత్వ భావన చుట్టూ ఆ రంగంలో అజేయమైన జనాకర్షక శక్తిని సమీకరించుకున్నారు.

బాట్లా హౌస్ ఎదురుకాల్పులపై సందేహాలను లేవనెత్తుతూ దిగ్విజయ్ సింగ్ తన సొంత పార్టీ వాదనను ఎలా నాశనం చేసేశారో గుర్తుకుతెచ్చుకోండి. ధైర్యసాహసాల ప్రదర్శనకు శాంతికాలంలో ఇచ్చే అత్యున్నత పురస్కారమైన అశోకచక్రను తమ సొంత ప్రభుత్వం చేతుల నుంచే అందుకున్న ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆ ఎదురుకాల్పుల్లో మరణించారు.

ఉద్వేగభరితమైన "జాతీయ భద్రత" సమస్యపై మోదీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే అవకాశాన్ని ఆ పార్టీ సొంత నాయకుడే అయిన అమరీందర్‌సింగ్ సృష్టించారు. అయినా మోదీ ప్రభుత్వం కెనడా రక్షణమంత్రిని ఎలా ఆహ్వానిస్తుంది? దేశ సమగ్రతకు, దాని అంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోకుండడానికి ఆయన నుంచి విస్పష్టమైన హామీని కోరుతుందా?

కానీ కాంగ్రెస్ ఎప్పటిలా నిద్రపోతోంది. బహుశా వాళ్లు అమరీందర్ మరీ ఎక్కువగా మాట్లాడటం లేదూ, అని ఆలోచిస్తుండవచ్చు. నరేంద్ర మోదీది ఎంత సునిశిత దృష్టో తెలిసిందే. ఆయనైతే ఈ విషయాన్ని వెంటనే మదిలో భద్రపరుచుకుని ఈ సమస్యను లేవనెత్తడానికి వచ్చిన మొట్టమొదటి సందర్భాన్నే అందిపుచ్చుకునేవారు. ఏదో ఒక విశ్వసనీయమైన హామీని లేదా వివరణను రాబట్టి.. అమరీందర్ కల్పించిన ఈ అవకాశాన్ని తనకు అనుకూలంగా వాడుకునేవారు. జాతీయవాదం అనే అంశం ఏ రాజకీయ పార్టీ, అన్నిటికీ మించి ఏ జాతీయపార్టీ వదిలి పెట్టకూడనిది. అలాంటి జాతీయవాదానికీ, హిందూత్వకు మధ్య ఉన్న విస్పష్టమైన తేడాను గుర్తించగల శక్తి సైతం లేనిదిగా కాంగ్రెస్ మారేలా దాని బుర్రకు నూరిపోశారు. ఆ పార్టీకి పట్టిన గతే ఆ విషయాన్ని తెలుపుతోంది."

మళ్లీ తాజా అంశానికొస్తే.. ఫిబ్రవరి 2018లో జరిపిన తన భారత పర్యటనలో ట్రూడో అమరీందర్‌సింగ్‌తో భేటీ అయ్యారు. కెనడాలో భారత్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న 9 సిక్కు ఉగ్రవాద సంస్థల జాబితాను ట్రూడోకు అందజేశారు. ఆ సంస్థలు ఖలిస్థాన్ పేరుతో తీవ్రవాద భావజాలాన్ని వ్యాపింపజేస్తున్నాయని, పంజాబ్‌లో హింసను ప్రేరేపిస్తున్నాయని తెలిపారు. ఆ సంస్థలు, వాటి సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఖలిస్థాన్ సానుభూతి పరుడనే భావనతో గతంలో తాను పంజాబ్‌లో కలుసుకోవడానికి నిరాకరించిన కెనడా రక్షణ మంత్రి, సిక్కు జాతీయుడు హర్జిత్ సజ్జన్‌తో కూడా అమరీందర్ కరచాలనం చేశారు.

స్వదేశంలో సిక్కులను ఆకట్టుకోవాలని, భారత్‌తో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలని ట్రూడో తన పర్యటనలో ప్రయత్నించారు. కానీ ట్రూడో విందుకు ఖలిస్థాన్ సానుభూతిపరుడు జస్పాల్ అత్వాల్‌కు ఆహ్వానం పంపటంపై వివాదం రేగటంతో పరిస్థితి మొదటికొచ్చింది. కెనడా భూభాగంపై విదేశాలకు వ్యతిరేకంగా చేపట్టే వేర్పాటు ఉద్యమాలను అనుమతించబోమని, భారత వ్యతిరేక చర్యల్ని సమర్థించబోమని మాత్రం జస్టిన్ ట్రూడో స్పష్టంచేశారు. 1947 భారత విభజన స్మృతిగా నిర్మించిన మ్యూజియంను సందర్శించి విభజనపై విచారం వ్యక్తం చేస్తూ ఒక సందేశాన్ని కూడా ఆయన రాశారు.

ఈ మొత్తం నేపథ్యాన్నీ చూశాక.. విదేశాలను కట్టడి చేయటం సరే, దేశీయంగా అందరినీ కలుపుకుని పోవడానికి మనమేం చేస్తున్నాం? వ్యక్తులకన్నా, పార్టీలకన్నా దేశం మిన్న అని నిబద్ధతతో రాజకీయాలు సాగడానికి ఎలాంటి సంస్కరణల్ని తీసుకొస్తున్నాం? అన్న ప్రశ్నలు తలెత్తక మానవు. ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా విద్వేషాలను రెచ్చగొట్టి లబ్ధి పొందడానికి జాతీయ పార్టీలు ప్రయత్నిస్తున్నప్పుడు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఒక హెచ్చరిక చేశారు: 'ఆంధ్రప్రదేశ్ మరో పంజాబ్‌లా మారే ప్రమాదాన్ని సృష్టించొద్దు'. పాఠాలు నేర్చుకున్నామా? ☼

# 'ప్రజలకు జైలు.. అవినీతి అధికారులకు ముద్దు' అనే మోదీ చట్టసవరణను ఒక్క పార్టీ కూడా ఎందుకు ప్రశ్నించటం లేదు?



"మనం పన్నులు కడుతున్నాం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు ఫీజులు కడుతున్నాం, కాబట్టి హక్కుగా ఆ సేవలు అందాలి. వాటికి లంచం అడిగేవాళ్ల భరతం పట్టే వ్యవస్థను ఏర్పాటు చేయటం చేతగాక, ధైర్యం లేక.. ఓ సర్టిఫికెట్ కోసం గతిలేక లంచం ఇచ్చే ప్రజల మీద కేసులు పెట్టి జైల్లోకి పంపిస్తామనే చట్టాన్ని తీసుకురావటాన్ని పరిపాలన అంటామా?'' అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ ప్రశ్నించారు.

ఇలాంటి పాలకులుంటే పనామా పత్రాలు, ప్యారడైజ్ పత్రాల్లో భారతీయులు పేర్లు నిరంతరం వస్తూనే ఉంటాయన్నారు. ఏదైనా అవినీతి కుంభకోణం జరిగితే 'సిట్' వేశాం, మరో కమిషన్ వేశాం అని భారీ ప్రసంగాలు చేయడం, బీరాలు పలకడం తప్ప, దేశంలో రోజూ ప్రభుత్వ కార్యాలయాల్లో పెరిగిపోతున్న లంచాల్ని ఆపేందుకు పౌర సేవల చట్టం వంటి కనీస చర్యలు కూడా తీసుకోలేని అసమర్థ, అవగాహనారహిత పాలన రాష్ట్రంలో, దేశంలో కొనసాగుతోందని జేపీ అన్నారు. ఏ ప్రభుత్వ అధికారిని ఏసీబీ పట్టుకున్నా వందల కోట్ల ఆస్తులు కనబడుతున్నాయన్నారు. జాతీయ స్థాయిలో, రాజస్తాన్‌లో అవినీతి నిరోధక చట్టానికి చేస్తున్న సవరణలు పరిపాలననే అపహాస్యం చేస్తున్నాయన్నారు. పాలనకు అర్థం తెలిసినవారెవరూ ఇలాంటి చట్టాల్ని తీసుకురారన్నారు.

గతి లేక లంచం ఇచ్చిన పౌరులకు 3 నుంచి 7 ఏళ్ల జైలు శిక్ష, లంచం తీసుకున్న ఉద్యోగుల మీద మాత్రం విచారణకు కూడా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలి అంటూ కేంద్రంలోని ప్రభుత్వం అవినీతి నిరోధక చట్టాన్ని భ్రష్టుపట్టిస్తూ సవరణను తీసుకొస్తున్నా ఒక్క రాజకీయ పార్టీ అయినా ఎందుకు ప్రశ్నించటం లేదని జేపీ నిగ్గదీశారు. అవినీతిపై పోరాటాలు చేస్తున్నాం, నిప్పులాంటి వాళ్లమని చెప్పుకుంటున్న పార్టీలన్నీ ఇంత బరితెగించి ప్రజలను దోషులుగా చేస్తుంటే ఎందుకు కిమ్మనటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అవినీతి నిరోధక చట్టానికి తూట్లు పొడుస్తూ తీసుకొస్తున్న సవరణపై పార్లమెంటులోని అన్ని పార్టీల సభ్యులకు, అధ్యక్షులకు తాను లేఖలు రాశానని, అన్ని వివరాలనూ తెలిపానని, అయినా మూగ, చెవుడు, గుడ్డిలా ఆ చట్టానికి మద్దతు తెలుపుతున్నారన్నారు. తాను నిజాయతీపరుడినని ప్రధాన మంత్రి మోదీ చెప్పు కుంటున్నారని.. ఇలాంటి చట్టాన్ని తీసుకొస్తూ ఆయన నిజాయతీగా ఉండి ఏం లాభమని జేపీ ప్రశ్నించారు. ప్రస్తుతం పాలన జరుగుతున్న తీరును చూస్తుంటే, కొన్నాళ్లకు లంచాన్ని చట్టబద్ధం చేసినా ఆశ్చర్యపోన క్కర్లేదన్నారు.

సింహపురి సురాజ్య యాత్రలో భాగంగా జయప్రకాష్ నారాయణ్ నెల్లూరు నగరంలో యువత, వివిధ వర్గాల ప్రజలతో, మీడియాతో సమావేశమయ్యారు. విద్య, ఆరోగ్యం, లంచాల్లేని ప్రభుత్వ సేవలు, పంచాయతీలు, మునిసిపాలిటీలకు అధికారాలు, నిధులు, చట్టబద్ధపాలన, వ్యవసాయంలో ఆదాయం తదితర అంశాలపై లోతుగా చర్చించారు. ప్రశ్నిస్తూ, జవాబులిస్తూ, అభిప్రాయాలు తెలుసుకుంటూ పరిష్కారాలను అందిస్తూ కార్యోన్ముఖుల్ని చేశారు.

విదేశాల్లో భారతీయులు దాచుకున్న నల్లధనంలో వెలుగుచూసింది చాలా తక్కువ అని జేపీ అన్నారు. మనదేశంలో నుంచి ఏటా లక్షల కోట్లు బైటికి ధారాళంగా పోతున్నా పట్టించుకోకుండా నల్లధనాన్ని వెనక్కిరప్పిస్తున్నామంటూ కబుర్లతో మభ్యపెడుతున్నారన్నారు. మనదేశానికి చెందిన పలువురు

పారిశ్రామికవేత్తలు విదేశాల్లో ఎందుకు పెట్టుబడులు పెడుతున్నారో ఆలోచించే విజ్ఞతను కూడా పాలకులు కనబరచలేక పోతున్నారన్నారు. నేతలు, అధికారులు కలిసి ఇష్టమొచ్చినట్టు పందేరం చేస్తూ, దోచేస్తుంటే, పన్నుల రూపంలో ఆ డబ్బును కట్టిన ప్రజలు మాత్రం చేయి జాచి అడుక్కుంటున్నారని అన్నారు.

నిధుల వినియోగాన్ని కూడా అవినీతికి ఆస్కారమిచ్చేలానే పాలకులు చేస్తురని జేపీ అన్నారు. కేంద్రం నుంచి బడ్జెట్‌లో 51శాతం రాష్ట్రాలకు వస్తుంటే, దాంట్లో వెయ్యికి ఒక్క రూపాయి కూడా స్థానికంగా పంచాయతీలు, మునిసిపాలిటీలకు రావడం లేదన్నారు. సుమారు 6లక్షల జనాభా ఉన్న నెల్లూరు నగర ప్రజల పేరు మీద రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.1800 కోట్లు ఖర్చు చేస్తోందని, ఇక్కడేం చేయాలో అమరావతి నుంచి నిర్ణయిస్తోందని అన్నారు. ఇలాంటి నిర్ణయాలే అవినీతికి దన్నుగా మారుతున్నాయని అన్నారు. నెల్లూరులో జరగాల్సిన పనుల్ని నెల్లూరువారే నిర్ణయించుకోవాలని, ఇందుకోసం సగం డబ్బుల్ని రాష్ట్రం స్థానికంగా ఇక్కడికి ఇచ్చేయాలని అన్నారు. ప్రపంచంలో మరే దేశంలోనూ కనిపించనంత అధ్వాన్నమైన పాలనా విధానాలను అనుసరిస్తూ గొప్ప నాయకులుగా ఫోజులిస్తున్నారన్నారు. విద్యలో ఒక్కో స్కూలు విద్యార్థి మీదా ఏపీ ప్రభుత్వం ఏటా రూ.60,000 ఖర్చు చేస్తోందని, కానీ చదువు మాత్రం అధ్వాన్నంగా ఉందని అన్నారు. వ్యవసాయంలో రైతుకు లాభాలు రాకుండా అన్ని రకాలుగా నడ్డివిరిచే విధానాలను అనుసరిస్తూ, రైతే రాజు వంటి నినాదాలు, రుణమాఫీలు వంటి విధానాలతో మభ్యపెడుతున్నారన్నారు.

ఢిల్లీ, అమరావతి, హైదరాబాద్‌లలో కూర్చోవటం కాదు, మా వద్దకు వచ్చి మా సమస్యల్ని పరిష్కరించే స్పష్టమైన విధానాలను చెప్పండి, అమలు చేయండి అని ప్రశ్నించినప్పుడే ప్రజాస్వామ్యంలో చైతన్యం వస్తుందని, సురాజ్యం సాకారమవుతుందని జేపీ అన్నారు. ఈ దిశగా యువతకు, ఇతర ప్రజలకు తోడ్పాటునివ్వడానికే యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ అనే వెబ్ ప్లాట్‌ఫారాలను అందుబాటులోకి తెచ్చామని, వాటిలో ఆలోచనల్ని, సూచనల్ని వంచుకోవాలని, కార్యాచరణల్లో పాలుపంచుకోవాలని సూచించారు.

లోక్‌నత్తా నేతలు బండారు రామ్మోహనరావు, బాలసుబ్రమణ్యం, ప్రజాసైన్స్ కార్యదర్శి మాల్యాద్రి, బుచ్చిరాజు, నారాయణ, శ్రీనివాసులు, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ☼

# హోదా దగాపై వాస్తవాల్ని ప్రజలు తెలుసుకోవాలి




ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా నాలుగేళ్లుగా తెదేపా మౌనంగా ఉందని, అసెంబ్లీలో, పార్లమెంటులో సంఖ్యాబలం ఉన్నా ప్రతిపక్ష వైకాపా కాలక్షేపం చేస్తూ వచ్చిందని బాబ్జీ అన్నారు. హోదాతో వచ్చే పారిశ్రామిక రాయితీలు, పోలవరం, రెవెన్యూలోటుపై వెంటనే మేలుకోవాలని నీతి ఆయోగ్ రాకముందే 2015లో జేపీ హెచ్చరించినా తెదేపా కదల్లేదన్నారు. కేవలం అమరావతిలో భవనాల వల్ల ఏపీ ప్రజల జీవితాలు బాగుపడవన్నారు. హోదాపై మోదీ ప్రభుత్వ అన్యాయాన్ని, రాష్ట్ర నేతల నిర్లక్ష్యాన్ని ప్రజలు తెలుసుకోవాలని ఆయన చిలకలూరిపేట, విశాఖపట్నాల్లో లోక్‌సత్తా పార్టీ నిర్వహించిన సమావేశాల్లో సూచించారు. విభజన హామీల అమలుకోసం తాము పార్టీలకతీతంగా కృషి చేస్తున్నామన్నారు. విజయనగరంలో, ఎస్.కోటలోని పుణ్యగిరి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జనఘోష కార్యక్రమాల్లో ఉత్తరాంధ్ర చర్చావేదిక అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ, అఖిలపక్షంతో కలిసి బాబ్జీ పాల్గొన్నారు. ☼

# నే చూసిన అత్యంత తెలివైన మహిళల్లో ఆమె ఒకరు, కానీ...

ఆడపిల్ల పక్క ఊరికి వెళ్లి చదువుకోవటం ఏమిటి? అనే ఛాందస ధోరణితో తన తాతగారు ఆలోచించటం వల్ల తన తల్లిగారి చదువు 8వ తరగతితోనే ఆగిపోయిందని, ఆమె తెలివితేటలు ఇంకిపోయాయని జేపీ అన్నారు. తాను చూసిన అత్యంత తెలివైన మహిళల్లో తన తల్లి ఒకరన్నారు. ఆమెకు సరైన చదువు అందిఉంటే చాలా గొప్ప స్థాయిని అందుకోగలిగేవారని, దేశానికి ఎంతో మేలు చేయగలిగి ఉండేవారని అన్నారు. ఆనాటితో పోలిస్తే ఈరోజు పరిస్థితులు మెరుగ్గా ఉన్నా, బాలికల పట్ల ఇంకా వివక్ష కొనసాగుతోందని అన్నారు.





కడప జిల్లా ఒంటిమిట్ట జడ్పీ పాఠశాలలో సురాజ్య యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేపీ మాట్లాడుతూ.. బాలికల్ని చులకనగా చూడొద్దని తల్లిదండ్రులకు, సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఆడ, మగ తేడాలేకుండా పిల్లల్ని పెంచాలని, సంస్కారాన్ని, నైపుణ్యాల్ని పెంపొందించాలని అన్నారు. ఆడపిల్లలు ఏమాత్రం ఆత్మన్యూనత లేకుండా చదువుకుని మగపిల్లలతో పోటీ పడి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. తన దృష్టిలో చదువులో మగపిల్లలకన్నా ఆడపిల్లలే ఎక్కువ సమర్థంగా ఉన్నారన్నారు. మగపిల్లలకు తెలివితేటలు, సామర్థ్యం తక్కువని కాదని, వారికున్న ఇతర వ్యాపకాలు ఆడపిల్లలకు అంతగా లేవని అన్నారు. సమాజంలోని పరిణామాలు, పరిష్కారాల్లో ఆడపిల్లలు కూడా పూర్తిస్థాయిలో భాగస్వాములైతేనే దేశం అభివృద్ధి చెందగలుగుతుందన్నారు. ఈవేళున్న పరిస్థితుల్లో ఆడపిల్లల మీదే దేశభవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే శిక్షణ, సీనియారిటీ ఉన్న ఉపాధ్యాయులున్నారని, విద్యావ్యవస్థను సరిచేస్తే మంచి విద్య సర్కారీ బడుల్లో అందించే అవకాశముందని జేపీ అన్నారు. పేద, ధనిక, కులం, మతం, ఆడ, మగ విభేదాలు పోవాలంటే విద్య తప్ప మరోమార్గం లేదన్నారు.

విద్యను క్రమశిక్షణ, సాంకేతిక పరిజ్ఞానంతో అభ్యసించటంతోపాటు సమాజం గురించి కూడా బాలికలు పట్టించుకోవాలని జేపీ సూచించారు. మహిళల వికాసానికి భద్రత పెద్ద ఆటంకంగా ఉందని, పూర్వకాలం నుంచీ వేధిస్తున్న ఈ సమస్యను పరిష్కరించటం సురాజ్య యాత్ర ఎజెండాలో భాగంగా ఉందని వివరించారు. చట్టబద్ధపాలన సంస్కృతిని పెంపొందించటం సురాజ్య యాత్ర లక్ష్యాల్లో ఒకటని అన్నారు.

వ్యక్తులుగా, సమాజంగా మహిళలు సంకెళ్లు తెంచుకుని ఎదగటానికి సురాజ్య లక్ష్యాల్లో భాగస్వాములు కావటం ఎంతో దోహదం చేస్తుందని, యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదై ఆత్మవిశ్వాసంతో ఎదగాలని జేపీ కోరారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి గ్రంథాలయాన్ని జేపీ ప్రారంభించారు. కాసేపు వారికి పాఠాలు బోధించి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జవాబులిచ్చారు. ఆలోచింపచేశారు.

పీఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.వి సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు హరికొండయ్య, ఆంజనేయులు, నారాయణరెడ్డి, శోభారాణి, భవానీ, రమాదేవి, పద్మజ, పీఏసీ వ్యవస్థాపకుడు మారంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ధనుంజయుడు, లోక్‌సత్తా వైజేఐ నేతలు తదితరులు పాల్గొన్నారు. ☼

# సంస్కర్త, దళిత బాంధవుడు దామోదరం సంజీవయ్య..

## పేదలు, అణగారిన వర్గాలు, మధ్యతరగతి కోసమే సురాజ్య యాత్ర

**దామోదరం సంజీవయ్య లాంటి వారిని గౌరవించుకోవటం వల్ల వ్యక్తిగతంగా వారికొచ్చే లాభమేమీ ఉండదని, కానీ సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని జేపీ అన్నారు. ఆయనకు తగిన గుర్తింపునివ్వటం మనందరికీ స్ఫూర్తినివ్వటానికి, మనందరి ప్రయోజనాల కోసమేనని అన్నారు. సంజీవయ్య ఇంటిని ఆయన ఆశయాలకు తగ్గట్టు తీర్చిదిద్ది పర్యాటకులను ఆకర్షించాలన్నారు. అలాగే స్థానికంగా తలసరి కేటాయింపులు చేసి పెద్దపాడులోని రోజువారీ పనులు పెద్దపాడులోనే నిర్ణయమై, వెంటనే అమలయ్యేట్టుగా చేయాలన్నారు.**



రాష్ట్రానికి ప్రథమ దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదరం సంజీవయ్య వ్యక్తిగత నిజాయతీని కాపాడుకోవటంతోపాటు పరిపాలనలో అనేక సంస్కరణల్ని తీసుకొచ్చారని జేపీ అన్నారు. దళిత బాంధవుడిగా ఆయన నిలిచిపోతారన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలోని దళితవాడలో జయప్రకాష్ నారాయణ్ పర్యటించారు. దామోదరం సంజీవయ్య ఇంటిని పరిశీలించి అక్కడ దళితులతో మాట్లాడారు.

గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, కర్నూలు నగరానికి వెళ్లి వాటర్‌కేన్‌లను తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానికులు జేపీకి తెలిపారు. ప్రస్తుతం ఎల్ పేట నుంచి నీటి సరఫరా జరుగుతున్నా తాత్కాలికమేనని వివరించారు. నాసిరకం పైపులైన్లు వేయటంతో ఎప్పుడు ఎక్కడ పైపులు లీకవుతాయో, మురుగు, ఇతర వ్యర్థాలు కలుస్తాయోనని వారు భయాందోళనలు వ్యక్తం చేశారు. సంజీవయ్య జ్ఞాపకార్థం ఆయన ఇంటిస్థలంలో గ్రంథాలయం, పార్కు ఏర్పాటు చేస్తే బాగుంటుందని అన్నారు. దళిత కాలనీలో సమగ్ర అభివృద్ధి జరగలేదని, మురుగు కాలువల నుంచి మురుగు బైటికి వెళ్లే ఏర్పాట్లు కూడా లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

దామోదరం సంజీవయ్య లాంటి వారిని గౌరవించుకోవటం వల్ల వ్యక్తిగతంగా వారికొచ్చే లాభమేమీ ఉండదని, కానీ సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని జేపీ అన్నారు. ఆయనకు తగిన గుర్తింపునివ్వటం మనందరికీ స్ఫూర్తినివ్వటానికి, మనందరి ప్రయోజనాల కోసమేనని అన్నారు. సంజీవయ్య ఇంటిని ఆయన ఆశయాలకు తగ్గట్టు తీర్చిదిద్ది పర్యాటకులను ఆకర్షించాలన్నారు. అలాగే స్థానికంగా తలసరి కేటాయింపులు చేసి పెద్దపాడులోని రోజువారీ పనులు పెద్దపాడులోనే నిర్ణయమై, వెంటనే అమలయ్యేట్టుగా చేయాలన్నారు. గ్రామంలో ఏం చేయాలో భారత రాజ్యాంగం, ప్రధాని, ముఖ్యమంత్రి, కలెక్టర్ నిర్ణయిస్తుంటే.. 6లక్షలకు పైగా గ్రామాలున్న భారతదేశం ఎన్నటికీ వృద్ధి చెందదన్నారు. గ్రామాలకు-పట్టణాలకు మధ్య అంతరాలు పెరిగిపోతూ పట్టణీకరణ ఓ అవకాశంగా కాకుండా సమస్యగా మారుతుందన్నారు. కుల వివక్ష పోవాలన్నా, పేదలు, అణగారిన వర్గాలకు ఎదిగే అవకాశాలు రావాలన్నా మంచి విద్య, ఆరోగ్యం ప్రతి బిడ్డకు, ప్రతి కుటుంబానికీ అందాలన్నారు. మనకున్న వనరులతోనే ఇది పూర్తిగా సాధ్యమన్నారు. ఈ లక్ష్యాల కోసమే సురాజ్య యాత్రను నిర్వహిస్తున్నా మన్నారు. సురాజ్య యాత్ర లక్ష్యాల్ని నెరవేర్చటానికి ఏ పార్టీకీ అభ్యంతరం ఉండాల్సిన పనిలేదని, కాస్త మంచి ఆలోచన చేసే బుద్ధి ఉంటే చాలని అన్నారు. సురాజ్య లక్ష్యాల వల్ల యువత, మధ్యతరగతి, పేదలు, దళితులు, మహిళలు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కాస్త అవగాహన, కలిసి పనిచేయటం నేర్చుకుంటే మనదేశంలో ప్రజలు, ముఖ్యంగా యువత అద్భుతాల్ని సృష్టించగలరన్నారు.

పెద్దపాడు నుంచి నేరుగా కర్నూలు మార్కెట్ యార్డుకి వెళ్లి అక్కడ రైతుల పరిస్థితిని జేపీ పరిశీలించారు.

బండారు రామ్మోహనరావు, భీశెట్టి బాబ్జీ, టి. రాజ్యలక్ష్మి, డాక్టర్ పద్మన్న, డేవిడ్, బలరాం, నాగరాజు, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలకు కొత్త చట్టం!

- యం. పద్మనాభరెడ్డి,
కార్యదర్శి, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

ఈ మధ్య కాలంలో తెలంగాణ ప్రభుత్వం గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి కొత్త చట్టాన్ని తెచ్చేందుకు చర్యలు తీసుకుంది. పంచాయతీ రాజ్ మంత్రి అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం పలుమార్లు చర్చలు జరిపి నివేదికను ముఖ్యమంత్రికి అందజేసింది. ముఖ్యమంత్రి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 2012 సంవత్సరంలో పంచాయతీ ఎన్నికలు జరుగవలసి ఉండగా అప్పటి ప్రభుత్వం జరపలేదు. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరపాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో వ్యాజ్యం వేసింది. దానిపై ఉన్నత న్యాయస్థానం ఎన్నికలు జరపాలని తీర్పు ఇచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం తీర్పు అమలు చేయకుండా సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి రాష్ట్రంలో ఉద్యమాలు జరుగుతున్నాయని ఇట్టి పరిస్థితుల్లో ఎన్నికలు జరపలేమని చెప్పింది. కానీ సర్వోన్నత న్యాయస్థానం ఒప్పుకోక ఎన్నికలు మూడు నెలల్లో జరపాలని తీర్పు ఇచ్చింది. చేసేది లేక రాష్ట్ర ప్రభుత్వం 2013 ఆగస్టులో ఉమ్మడి రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిపింది. అటు తరువాత రాష్ట్ర విభజన వరకు అప్పటి ప్రభుత్వం పంచాయతీలను పట్టించుకోలేదు.

ఇక తెలంగాణ రాష్ట్రంలో కూడా పంచాయతీలను ప్రభుత్వం చిన్న చూపే చూసింది. రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించి పంచాయతీలకు నిధులు విడుదల చేయలేదు. నామమాత్రంగా జీవో నెం.31, పీఆర్ అండ్ ఆర్‌డీ డిపార్ట్‌మెంట్, తేదీ 16-3-2015 ద్వారా రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించినా ఆ సంఘం పనిచేయడానికి సభ్యులనుకాని



అధ్యక్షులనుగాని నియమించలేదు. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. చివరకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా న్యాయస్థానం ఆదేశాలతో అధ్యక్షుల వారిని, ఒక సభ్యుడిని నియమించారు. చట్టప్రకారం నలుగురు సభ్యులుండాలి. అలాగే ఒక సీనియర్ అధికారిని సభ్య కార్యదర్శిగా నియమించగా ఆయన సెలవుపై వెళ్లాడు. ప్రస్తుతం నియమించిన రాష్ట్ర ఆర్థిక సంఘం ప్రభుత్వాన్ని ఒప్పించి గ్రామ పంచాయతీలకు నిధులు ఇప్పిస్తుందన్న ఆశ లేదు.

తెలంగాణ రాష్ట్రంలో ఇంకా కొద్ది మాసాలలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగే సమయంలో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కొత్త చట్టం తెచ్చే పనిలో ఉంది. 1994లో చేయబడ్డ గ్రామపంచాయతీల చట్టంలో లోపాలు పెద్దగా ఏమీ లేవు. చట్టం అమలు చేయకుండానే కొత్త చట్టం తీసుకు రావడానికి ప్రయత్నం చేయడం అర్థంలేని విషయం. ఏవైనా సవరణలు కావాలనుకుంటే చేసుకోవచ్చు. కానీ ఈ పద్ధతి వైద్యుడు చెప్పిన మందులు వాడకుండానే వైద్యుడిని మార్చిన చందంగా ఉంది.

గ్రామస్వరాజ్యం కావాలంటే పంచాయతీలు బలోపేతం కావాలని గాంధీగారు చెప్పారు. ఈ దిశగా 1957లో బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ వేశారు. పంచాయతీ వ్యవస్థ బలోపేతం చేయడానికి కమిటీ పలు సూచనలు చేసినా అవి అమలుకు నోచుకోలేదు. అటుతరువాత వరుసగా ఇంకా 6సార్లు వివిధ కమిటీలు వేసి చేతులు దులుపుకున్నారు. కానీ కమిటీల సిఫారసులు అమలుకాలేదు. ప్రపథమంగా పంచాయతీ రాజ్ వ్యవస్థను 1959లో రాజస్థాన్ రాష్ట్రంలో, తరువాత ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయడం జరిగింది. తరువాత దశలవారీగా అన్ని రాష్ట్రాల్లో గ్రామ పంచాయతీ వ్యవస్థను ఏర్పాటు చేసి చట్టాలు చేయడం జరిగింది. అయితే పంచాయతీలకు నిధులు, అధికారాలు లేక పంచాయతీ వ్యవస్థ అనుకున్న స్థాయికి చేరలేదు. పంచాయతీలను బలోపేతం చేయడానికి 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా.. షెడ్యూలు పదకొండులో చెప్పిన విధంగా 29 అధికారాలను బదలాయించాలని, అలాగే రాష్ట్రాలు ఆర్థిక సంఘాలను నియమించి వాటి ద్వారా అవసరమైన నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం జరిగింది. 29 అధికారాలలో తెలంగాణ రాష్ట్రంలో 10 అధికారాలు మాత్రమే గ్రామ పంచాయతీలకు మార్పిడి చేశారు. ఈ విధంగా దశలవారీ అరకొర మార్పిడితో ఎటువంటి ప్రయోజనం ఉండదు.

పంచాయతీలకు మూడు పద్ధతుల ద్వారా నిధులు అందుతాయి. 1) కేంద్ర ఆర్థిక సంఘం సిఫారసు మేరకు కేంద్రం నుంచి స్థానిక సంస్థల గ్రాంటు 2) రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసు మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంటులు 3)

గ్రామంలో పన్నుల ద్వారా స్వతంగా సమకూర్చుకునే నిధులు. గత మూడు సంవత్సరాలు కేంద్రం నుంచి నేరుగా గ్రామపంచాయతీలకు 14వ ఆర్థికసంఘం సిఫారసుల మేరకు నిధులు విడుదలైనా, మొత్తం డబ్బు పంచాయతీలకు అందలేదు. చాలా సందర్భాలలో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బకాయిలు ఇతరత్రా కారణాలతో కోత పెట్టడం జరిగింది. గమనించవలసిన విషయమేమిటంటే, కేంద్రం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయడం పోయి, కేంద్రం నుంచి వచ్చిన డబ్బులపై కోత విధించింది. అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధి (సీడీపీ), ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీపీ) పేరుతో స్థానిక శాసనసభ్యుడు, జిల్లా మంత్రి వందల కోట్లలో ఖర్చుచేస్తున్నారు. దీనిలో ఎటువంటి పారదర్శకత కాని, ఆడిట్ కాని జరగడం లేదు. పనుల గురించి ఎక్కడా చర్చ జరుగదు. సీడీపీ మరియు ఎస్‌డీపీ నిధులు గ్రామ పంచాయతీలకు, మునిసిపాలిటీలకు విడుదల చేస్తే అవసరమైన పనులు చేపట్టే అవకాశముంది.

మనదేశంలో గ్రామపంచాయతీ వ్యవస్థ చెప్పుకోదగినదిగా పనిచేస్తున్న వాటిలో కేరళ రాష్ట్రాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చు. కేరళ రాష్ట్ర జనాభా సుమారు తెలంగాణ రాష్ట్రంతో సమానంగా ఉంది. అక్కడ 941 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 8695 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటికి తోడు అదనంగా 4000 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. అంటే మొత్తం 12,695 గ్రామ పంచాయతీలు అన్నమాట! ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేయబోయే గ్రామ పంచాయతీల జనాభా సుమారు 400 నుంచి 600 వరకు ఉంటుంది. ఆర్టికల్ 243 (సి) ప్రకారం పంచాయతీ సభ్యుల సంఖ్య జనాభాపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు రాష్ట్రంలో 200 జనాభాకు ఒక పంచాయతీ సభ్యుడు అనుకుంటే కొత్తగా ఏర్పడే పంచాయతీలకు ముగ్గురు సభ్యులు.. అంటే ఒక సర్పంచ్, ఒక ఉపసర్పంచ్, ఒక వార్డు సభ్యుడు ఉంటారు. ఈ విధంగా గ్రామ పంచాయతీలు ఏర్పడటం ఏమాత్రం సమర్థనీయం కాదు. గ్రామపంచాయతీలు ఆర్థికంగా, పరిపాలనాపరంగా నిలబడాలంటే పెద్ద పంచాయతీలు ఉండాలని కేంద్రం రాష్ట్రాలను కోరడం జరిగింది.

10 జిల్లాలతో పాలనలో ఎటువంటి ఇబ్బందులు లేని రాష్ట్రాన్ని 31 జిల్లాలుగా విభజించారు. ఇప్పటికీ తగిన సిబ్బంది, మౌలిక సదుపాయాలు లేక పాలనావ్యవస్థ ఇబ్బందులకు గురవుతోంది. కొత్త జిల్లాలకు మౌలిక సదుపాయాల కొరకు రూ.1500 కోట్లు అవసరమని అంచనా. ఇక కొత్తగా ఏర్పడే 4,000 పంచాయతీలకు కావలసిన నిధుల సంగతి ఊహకు అందని విషయం.

కేరళ రాష్ట్రంలో అక్కడి రాష్ట్ర ఆర్థికసంఘం, రాష్ట్ర బడ్జెట్‌లో 35 నుంచి 40శాతం గ్రామ పంచాయతీలకు ఇవ్వడానికి సిఫారసు చేస్తుంది. ఈ విధంగా ప్రతి గ్రామ పంచాయతీకి సాలీనా ఒక కోటి నుంచి కోటీ యాభై లక్షల దాకా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అవుతాయి. దీనికితోడు కేంద్ర ప్రభుత్వ నిధులు, స్వంత నిధులతో ప్రతి గ్రామ పంచాయతీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగి, తమ గ్రామ పంచాయతీలలో కావలసిన పనులు స్థానిక ప్రజలు నిర్ణయించుకుంటారు. అధికార వికేంద్రీకరణలో భాగంగా గ్రామ పంచాయతీలకు కావలసిన నిధులు, విధులు, సిబ్బంది, పనుల నిర్ణయంలో స్వేచ్ఛ, ప్రభుత్వ శాఖలతో అనుసంధానంపై గట్టి చర్యలు తీసుకుని గ్రామ పంచాయతీలను కేరళ రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేసింది.

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తెచ్చే గ్రామ పంచాయతీ చట్టం కంటితుడుపు చర్య, దానితో పెద్దగా ఒరిగేది ఏమీ లేదు. గత నాలుగు సంవత్సరాలుగా పంచాయతీలకు నిధులు ఇవ్వడం, అధికారాల బదలాయింపు వంటివి ఏమీ చేయక, రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని కోర్టు చెబితేనేకానీ నియమించకపోవడం వంటివి పరిశీలించినప్పుడు కొత్త పంచాయతీ చట్టం రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్న కసరత్తు మాత్రమేనని అర్థమవుతోంది. కానీ పంచాయతీలకు ఎటువంటి లాభం చేకూరదు. పంచాయతీలకు కావలసింది అధికారాల బదలాయింపు, హక్కుగా నిధుల విడుదల.

ఏది ఏమైనా, మంత్రిమండలి సిఫారసు చేసిన కొత్త చట్టం ముసాయిదాను ప్రజల ముందు ఉంచి వారి సూచనలు, సలహాలు తీసుకుని బిల్లు అసెంబ్లీ ముందు ఉంచితే బాగుంటుంది. ఏ రాష్ట్రంలో అయినా శాసనసభ్యుడు గ్రామపంచాయతీలు బలోపేతంగా ఉండాలని అనుకోడు. ఎందుకంటే పంచాయతీలు (పంచాయతీ అధ్యక్షుడు) బలంగా ఉంటే శాసనసభ్యుని అధికారాలలో కోత పడుతుంది. సర్పంచ్ ఎన్నిక పద్ధతి, తాండాలను కూడా పంచాయతీలు చేయడం, ఎన్నికలు పార్టీపరంగా నిర్వహించడం వంటి చిన్న చిన్న విషయాలు సమస్యలుగా చూపిస్తూ, కొత్తగా చట్టాన్ని తీసుకురావడంలో ప్రభుత్వం వారికి పంచాయతీలపై చిత్తశుద్ధిలేమిని తెలియచేస్తోంది. పంచాయతీ రాజ్ చట్టం ప్రత్యక్షంగా ప్రజల మౌలిక సదుపాయాలకు సంబంధించిన విషయం కాబట్టి ప్రజల అభిప్రాయాలు తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రభుత్వం తయారుచేసిన బిల్లు, శాసనసభ ఆమోదించినా అది వేదం కాదు. శాసనసభ బయట కూడా ఎందరో పంచాయతీల పాలనపై అనుభవమున్న మేధావులు ఉన్నారు. కాబట్టి కొత్త బిల్లు చట్టం రూపం దాల్చక ముందే ప్రజల అభిప్రాయాలు తీసుకోవడం ఎంతో అవసరం.


*(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)* ☼

# నిధులు మస్తు - పల్లెలు పస్తు

## స్థానిక ప్రభుత్వాల పట్ల రాష్ట్రాల నిర్లక్ష్యం

- పిల్లా సాయికుమార్

పంచాయతీరాజ్ వ్యవస్థలు ఎంత బలోపేతమైతే గ్రామసీమలు అంతగా వికసిస్తాయి. తగిన నిధులు, విధులతో పంచాయతీలను పరిపుష్టం చేయడంలో ఏళ్లుగా నిర్లక్ష్యం కొనసాగుతోంది. పంచాయతీలకు 29 రకాల అధికారాలు, విధులు అప్పగించాలని రాజ్యాంగ సవరణ దిశానిర్దేశం చేస్తోంది. అది పలు రాష్ట్రాల పాలకులకు రుచించడంలేదు. అలాచేస్తే ఓటు బ్యాంకులుగా ఉంటున్న గ్రామ సీమలు తమ అదుపాజ్ఞల నుంచి జారిపోతాయన్నది వారి భయం. ఆ ఆందోళనతోనే అనేక రాష్ట్రాలు- జాతీయ ఆర్థిక సంఘాల సిఫార్సులను చిత్తశుద్ధితో అమలు చేయడం లేదు. అయితే నిధుల విడుదల, వినియోగాలకు సంబంధించి కేంద్రం గట్టి ఆంక్షలు విధించటంతో వివిధ రాష్ట్రాలు తూతూమంత్రంగానైనా కొన్ని కార్యక్రమాలు ప్రకటిస్తున్నాయి. నిబద్ధత లేకుండా కేవలం కేంద్ర నిధుల కోసం అమలుచేస్తున్న ఈ తరహా కార్యక్రమాల వల్ల క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్ సంస్థలకు ఎలాంటి ప్రయోజనమూ కలగడం లేదు. దేశంలోని అనేక ప్రాంతాలతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది.




### అందని అధికారాలు

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు- ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం పంచాయతీరాజ్ సంస్థల కీలక బాధ్యతలు. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్తులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తే రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. 73వ రాజ్యాంగ సవరణ చట్టంలోని 11వ షెడ్యూల్ ప్రకారం 29 అధికారాలు, విధులను రాష్ట్ర ప్రభుత్వాలు తమ పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ చేయాలి. అంటే ఆయా అంశాలకు చెందిన శాఖలు స్థానిక సంస్థల (ప్రభుత్వాల)కూ జవాబుదారీగా ఉండాలి. ఆ ఆదర్శం సాకారమైనప్పుడు సర్పంచ్ నుంచి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ వరకూ పనుల కోసం మంత్రులు, శాసనసభ్యుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం ఉండదు. గ్రామాభివృద్ధితో ముడివడిన ప్రతి పనీ చకచకా పూర్తవుతుంది. ప్రధానమైన ఈ రాజ్యాంగ సవరణ అమలు క్రమంలో ఒక్కో రాష్ట్రం ఒక్కో రకమైన పద్ధతి అనుసరించింది. నాలుగైదు రాష్ట్రాలు మాత్రమే అధికారాలను స్థానిక సంస్థలకు దఖలు పరిచాయి. గుజరాత్ 14 అంశాలను పూర్తిగా, అయిదు అంశాలను పాక్షికంగా స్థానిక సంస్థలకు బదిలీ చేసింది. ఆ రాష్ట్రంలో ఏకంగా 13శాఖల నుంచి స్థానిక సంస్థలకు నేరుగా నిధులు ప్రవహిస్తున్నాయి. అక్కడి పంచాయతీలు ఎనిమిది కీలకమైన పన్నులను వసూలు చేసుకోగలుగుతున్నాయి. కేరళ సర్కారు పూర్తిగా 29 అంశాలనూ పంచాయతీరాజ్ సంస్థలకు దఖలు పరచింది. ఆయా అంశాలపై ఆ సంస్థలకు పూర్తి స్థాయిలో యాజమాన్యపరమైన, పాక్షికంగా క్రమశిక్షణ చర్యలు తీసుకొనే అధికారాలు ఉంటాయి. ఆయా శాఖల నుంచి నిధుల్ని అవి నేరుగా అందుకుంటున్నాయి. కర్ణాటకలోనూ అధికారాలు స్థానిక సంస్థలకు దఖలు పడ్డాయి. అక్కడి పంచాయతీ ఉద్యోగులు పంచాయతీరాజ్ సంస్థతోపాటు సంబంధిత శాఖ పర్యవేక్షణలోనూ ఉంటారు. కొన్ని రాష్ట్రాలు అధికారాలను నిజంగానే బదలాయించాయి. అయితే అనేక రాష్ట్రాలు వాటిని దఖలు పరచినట్టుగా ఉత్తర్వులు వెలువరించి చేతులు దులిపేసుకున్నాయి. స్థానిక సంస్థల ప్రతినిధులు ఏనాటికీ పూర్తిగా తమపై ఆధారపడే అడుగులు కదపాలన్నది ఆయా రాష్ట్రాల్లోని పాలకుల మనోగతం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో అధికారాల బదిలీ వ్యవహారం ప్రహసనంగా మిగిలిపోయింది. మొత్తం 29 అంశాల బదిలీకిగాను, తెలంగాణలో కేవలం పదింటికి సంబంధించిన విధులను పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ చేస్తున్నట్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. వాటిలో కేవలం వ్యవసాయం, పశు సంవర్ధక, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మత్స్యశాఖ వంటి నాలుగు విభాగాల నుంచే నిధులు నామమాత్రంగా పంచాయతీరాజ్ సంస్థలకు విడుదలవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి. అక్కడ 2015-16లో వివిధ శాఖల ద్వారా రూ.70కోట్లు స్థానిక సంస్థలకు కేటాయిస్తున్నట్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. కానీ, వాస్తవంలో ఖర్చయింది కేవలం రూ.4.8కోట్లు! అంటే, రాజ్యాంగ సవరణ ఆశించిన

లక్ష్యాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో నరైన మన్నన దక్కడంలేదనే స్పష్టమవుతోంది.

## ఆర్థిక సంఘం సిఫార్సులు ఏవీ?

కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్లు తదితరాలపై ఆర్థిక సంఘాలు జాతీయ స్థాయిలో సిఫార్సులు చేస్తాయి. వాటి కోసం రాష్ట్రాలు అయిదేళ్లకోసారి అత్యంత ఉత్కంఠగా ఎదురుచూస్తాయి! అదేవిధంగా స్థానిక సంస్థలూ రాష్ట్రస్థాయిలో ఏర్పాటయ్యే ఆర్థిక సంఘాలు వెలువరించే సిఫార్సుల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తుంటాయి. అయిదేళ్లకు ఒకసారి ఆర్థిక సంఘం ఏర్పాటు కావాల్సి ఉన్నా- రాష్ట్రాలు ఈ విషయంలో ఉదాసీనంగా ఉంటున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003నాటికి మూడో ఆర్థిక సంఘం సిఫార్సుల నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు ఇప్పటికీ స్థానిక సంస్థలకు ఆశించిన స్థాయిలో నిధులు విడుదల చేయటం లేదు. ఆర్థిక సంఘం ఏర్పాటు ఉత్తర్వులను తెలంగాణ ప్రభుత్వం 2015 మార్చిలో వెలువరించినా- చాలాకాలం దానికి ఛైర్మన్‌ను నియమించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో ఛైర్మన్ నియామకం పూర్తయినా పురోగతి లేదు. స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ, సీనరేజ్ సెస్ వంటి గ్రాంట్లను రెండు రాష్ట్ర ప్రభుత్వాలూ సక్రమంగా విడుదల చేయడం లేదు. నిధులు అందినప్పుడే పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం సాధ్యపడుతుంది. ప్రస్తుతం మండల, జిల్లా పరిషత్తులు నిధుల లేమితో కొట్టుమిట్టాడు తున్నాయి. పదవుల్లో తామెందుకు ఉన్నామో తమకే తెలియడం లేదని ఎంపీటీసీలు వాపోతున్నారు. మండల, జడ్పీ సమావేశాలు నిస్సారంగా ముగుస్తున్నాయి. జడ్పీ అధీనంలోని మంచినీటి పథకాలు, నిర్వహణ-నిధుల కొరత కారణంగా స్తంభించిపోతున్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం నేరుగా గ్రామ పంచాయతీలకు మాత్రమే ఇస్తోంది. కాబట్టి జడ్పీ, మండల పరిషత్ లకు రాష్ట్ర ప్రభుత్వాలే తోడ్పాటుగా నిలవాలి. మండల, జడ్పీలకూ నిధులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కేంద్రానికి ఆర్థిక సంఘం సిఫార్సులే ప్రాతిపదిక కాబట్టి తెలంగాణ కోరిన విధంగా నిధులు రాకపోవచ్చు. పన్నుల్లో వాటాను 42శాతానికి పెంచాం కాబట్టి ఇలాంటి ఆర్థిక సమస్యలను రాష్ట్రాలే పరిష్కరించుకోవాలన్నది కేంద్రం వాదన.

స్థానిక సంస్థలను బలోపేతం చేసే విషయంలో రాష్ట్రాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిన విషయం సుస్పష్టం. ఫలితంగా కేంద్రప్రభుత్వం ఆర్థికపరమైన కొన్ని ఆంక్షలను తెరమీదకు తీసుకువచ్చింది. 13, 14 కేంద్ర ఆర్థిక సంఘాల సూచనలు కొంతవరకైనా అమలయ్యేలా ప్రయత్ని స్తోంది. ఆ సూచనలను అమలు చేయని పక్షంలో నిధులు నిలిచిపోతాయన్న భయంతో కొన్ని రాష్ట్రాలు గట్టి చర్యలు చేపడుతుండటం ముదావహం. సిద్ధాంతాలు ఎలా ఉన్నా ఆచరణ విషయంలో ఇంకా రాటుదేలాల్సి ఉంది. పంచాయతీ రాజ్ వ్యవస్థలో వార్డు సభ్యుల నుంచి జడ్పీ ఛైర్‌పర్సన్ వరకు ప్రజాప్రతి నిధులు పెద్దసంఖ్యలో ఉంటారు. వారిపై అనేక ఫిర్యాదులూ వస్తుంటాయి. వాటిని పరిశీలించి తీర్పు చెప్పడానికి ప్రస్తుతానికి ఎలాంటి యంత్రాంగమూ అందుబాటులో లేదు. దాంతో స్థానిక సంస్థల్లో అవకతవకలు రివాజుగా మారాయి. ఫిర్యాదుల పరిష్కారానికి అంబుడ్స్‌మన్ (స్వతంత్ర న్యాయాధికారి) వ్యవస్థ ఉండాలని 13వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. ఆ తరహా నిర్దిష్ట ఏర్పాట్లు చేసిన రాష్ట్రాలకే 'గ్రాంట్లు' ఇవ్వాలనీ స్పష్టీకరించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 'అంబుడ్స్‌మన్'ను నెలకొల్పకుండా కేవలం లోకాయుక్త చట్టానికి సవరణ తీసుకువచ్చారు. ఆ మేరకు పంచాయతీ రాజ్‌లో ఫిర్యాదులపై విచారణను లోకాయుక్త పరిధిలోకి తెచ్చారు. కేంద్ర గ్రాంట్లు నిలిచిపోకుండా జాగ్రత్తపడ్డారు. ఆర్థిక సంఘం చెప్పినట్టు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటును మాత్రం విస్మరించారు.

## కొరవడిన కార్యాచరణ

నిధుల్ని స్థానిక సంస్థలకు వెంటనే పంచకుండా, రాష్ట్రాలు కొద్దిరోజులపాటు తమ సొంతానికి వాడుకొంటున్నాయని కేంద్రం పసిగట్టింది. ఫలితంగా నిధుల పంపిణీ వివరాలను తేదీలవారీగా సమగ్రంగా, ధ్రువీకరణ పత్రాల (యూసీలు)తో సహా అందజేయాలని ఆదేశించింది. ఆలస్యమైన రోజులకు వడ్డీ చెల్లించాలన్న నిబంధననూ తీసుకు వచ్చింది. 'యూసీ'ల జారీలో ఆలస్యం వల్లే 2016-17లో తెలంగాణ గ్రామ పంచాయతీలకు తొలి విడత నిధుల విడుదలలో జాప్యం చోటుచేసుకుంది. పల్లె ప్రణాళికలను తప్పనిసరిగా తయారు చేయాలని కేంద్రం తేల్చిచెప్పడంతో తెలుగు రాష్ట్రాలు ఆ మేరకు గట్టి కసరత్తు చేశాయి. అయితే వాటి ప్రకారం క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టిన దాఖలాలు మాత్రం లేవు. నిధుల అవసరార్థం తప్ప పల్లెల వికాసం గుర్తుకురాని ప్రస్తుత స్థితి మారాలి. స్థానిక సంస్థలు పరిపుష్టంగా ఉంటేనే పట్టణాలకు వలసలు తగ్గుతాయన్న సత్యాన్ని రాష్ట్రాలు గుర్తెరగాలి. తెలుగు రాష్ట్రాల్లో స్థానిక సంస్థల కార్యకలాపాలను పరిశీలించిన 'కాగ్'- ఆయా సంస్థల్లో జవాబుదారీతనం, ఆర్థిక అంశాల నివేదన తగిన స్థాయిలో లేదంటూ వ్యాఖ్యా నించింది. స్థానిక సంస్థలను 'స్థానిక ప్రభుత్వాలు'గా వ్యవహరిస్తేనే వాటి ప్రాధాన్యం పాలకులకు అవగతమవు తుంది. తెలుగు రాష్ట్రాల్లో పంచాయతీరాజ్ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. పంచాయతీలకు అధికారాలు, విధులు ఇస్తామన్న ఎప్పటిమాదిరి తూతూ మంత్రం ప్రకటనలను పక్కనపెట్టి- తగిన కార్యాచరణకు ఉపక్రమించాలి. పల్లెల/ స్థానిక ప్రభుత్వాల సమగ్రాభివృద్ధితోనే రాష్ట్రాలు, దేశం ప్రగతిపథంలో పయనిస్తాయన్న వాస్తవాన్ని అందరూ గుర్తించాలి.

(కర్టెసీ: ఈనాడు) ☼

# బ్యాలెట్ బాక్సుల్లో మగ్గుతున్న ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకునేందుకు స్వాతంత్ర్యానంతరం తగిన ఏర్పాట్లు చేసుకోకపోవటంతో మన ప్రజాస్వామ్యం బ్యాలెట్ బాక్సుల్లో/ ఈవీఎంలలో, కాగితాల్లో బందీగా మారిందని జేపీ అన్నారు. ఎన్నుకునేది మనం, పాలన మనది, పాలకులు, అధికారులు మన సేవకులు అనే భావనతోకాకుండా.. ఓటునడ్డం పెట్టుకుని ఎన్నికల సమయంలో అయినకాడికి దండుకోవటం, ఎన్నికైనవాడు రాజు అనే ధోరణితోనే ఇంకా ప్రజలు వ్యవహరించే దశలోనే మన ప్రజాస్వామ్యం ఉందన్నారు. పౌరసత్వ భావన, పన్నులు కట్టే డబ్బులకు తగిన సేవల్ని పొందటం అనే స్పృహ ప్రజల్లో పెరిగేలా ప్రజాస్వామ్య నిర్మాణం జరగలేదన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా గుంటూరు జిల్లా బాపట్లలో ఆయన పలు కార్యక్రమాల్లో వివిధ వర్గాల ప్రజలతో చర్చించారు. సాధన హైస్కూల్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశంలో ప్రధాని, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులే పాలన సాగిస్తున్నారని, మంత్రులు ఉత్సవ విగ్రహాల్లా వ్యవహరిస్తున్నారని జేపీ అన్నారు. ప్రజలకు ఏం కావాలో ఆలోచన చేసి ఆచరణలో పెట్టేందుకు ఎవరూ ప్రయత్నించటం లేదన్నారు. ఆలోచనాపరులు గొంతు విప్పాల్సిన అవసరముందన్నారు. పెత్తనం కోసం పోరాటమేగానీ ప్రజాస్వామ్యం కోసం పనిజరుగుతోందా అని ప్రశ్నించారు. రిజర్వేషన్లతో సంపన్నులైన వారే మళ్లీ మళ్లీ లబ్ధి పొందుతున్నారని, దానివల్ల ఆ కులాల్లోనే లబ్ధి పొందలేని పేదవారు అసంఖ్యాకంగా ఉన్నారని అన్నారు. తాను రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని.. కానీ అమల్లో ఘోరమైన వైఫల్యం ఉందన్నారు. ఎన్నికల్లో లోక్‌సత్తాకు 10శాతం ఓట్లు నిలకడగా అన్నిచోట్లా వచ్చే పరిస్థితి లేనందున పోటీకి దూరంగా ఉన్నామని, ఉద్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని పెంచుతామని అన్నారు. తమ పోరాటాల ఫలితంగానే సహకార వ్యవస్థకు స్వయంప్రతిపత్తి సహా పలు కీలక రాజ్యాంగ, చట్టసవరణలు వచ్చాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల్లో ప్రధాన మార్పులు వచ్చాయని వివరించారు. చట్టం ముందు ప్రజలందరూ సమానంగా లేరని, అధికారం కొంతమంది వ్యక్తుల చేతిలో కేంద్రీకృతమై ఉందని అన్నారు. ప్రజలు ఎదగటానికి కావలసిన నాణ్యమైన విద్యను అందించటలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. చదువుల్లో 80శాతం డిగ్రీలు పనికిరానివన్నారు. ఒకటికాదు, రెండు కాదు దశాబ్దాల తరబడి ఈ వైఫల్యం కొనసాగుతూ వస్తోందన్నారు. ప్రభుత్వాల విధానాల వల్ల నిరుద్యోగ యువతలో తీవ్ర అశాంతి ప్రబలుతోందని, కొత్త సంక్షోభానికి దారితీస్తోందని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సక్రమంగా పనిచేసేందుకు పౌర సేవల చట్టం రావాలని, మహిళల భద్రతకు, చట్టబద్ధపాలనకు స్థానిక కోర్టులు, ఇతర చర్యల్ని తీసుకురావాలని అన్నారు. ఇవేవీ పెద్ద ఖర్చుతో కూడుకున్నవి కావని, సులభంగా పూర్తయ్యేవని, ఎవరికీ అభ్యంతరం ఉండాల్సినవి కూడా కావని, కానీ జనం జీవితాల్లో మాత్రం పెద్ద మార్పును



### తెల్లకాగితంపై పనులు చేసిన ఘనత జేపీకే దక్కుతుంది

ప్రకాశం జిల్లా నీటిపారుదల శాఖలో తెల్లకాగితం మీద పనులు చేసిన ఘనత జేపీకే దక్కుతుందని, ఆయన నిజమైన ప్రజానేతని సభకు అధ్యక్షత వహించిన వివేకా సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ అన్నారు. సురాజ్య ఉద్యమ లక్ష్యాలకు పూర్తి తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు.

### సీపీఎస్ విధానం రద్దు చేయాలి

నూతన పింఛన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేయాలని, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగుల సంఘం నాయకుడు గుర్రం మురళీకృష్ణ అన్నారు. ఈ మేరకు జేపీకి బాపట్ల సురాజ్య యాత్రలో వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఉయ్యూరి సురేష్‌పాండు, ఎ.శ్రీనివాసరావు, బాజి పఠాన్, రత్నరాజు, వినయ్, మోహనరావు, గవిని శ్రీనివాసరావు, వై.భాస్కరరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

తెచ్చేవని అన్నారు. ప్రజల్లో అవగాహనాలేమిని అడ్డంపెట్టుకుని పాలకులు ఈ కీలకాంశాల్ని దాటవేస్తూ దేశానికి ద్రోహం చేస్తున్నారన్నారు. దీన్ని సరిచేసేందుకే పార్టీలకతీతంగా సురాజ్య ఉద్యమాన్ని చేపట్టామన్నారు.

గుంద్రెడ్డి సత్యనారాయణ, శీలం శ్రీనివాసరావు, కోళ్లపూడి సుధాకర్ గుప్త, పోతురాజు రెడ్డి, వంకాయలపాటి హరిబాబు, బీవీఎస్ఆర్ఏ శాస్త్రి, బండారు రామ్మోహనరావు, భీశెట్టి బాబ్జీ, మాదాసు భానుప్రసాద్, కొత్త సూర్య, దుర్గాదేవి, ఎం.శ్రీనాథ్‌రెడ్డి, సురేష్, వైబీఐ కన్వీనర్ శివరామకృష్ణ, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు. ☼

# రాయలసీమకు అన్యాయం చేస్తే సహించం





రాయలసీమకు అన్యాయం చేస్తే సహించబోమని, ప్రజా ఉద్యమాలు చేస్తామని లోక్‌సత్తా పార్టీ ఏపీ కార్యవర్గ సభ్యుడు వెంకటరమణబాబు, కడప జిల్లా అధ్యక్షుడు దేవర శ్రీకృష్ణ, గంపా తిరుపతి అన్నారు. ప్రత్యేకహోదా విషయంలో ప్రధాన రాజకీయ పార్టీలు డ్రామాలాడుతున్నాయన్నారు. కడపలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన విషయంలో తెదేపా, వైకాపా ప్రజలను మాయచేసేలా ఆడిన భావోద్రేక క్రీడల వల్లే ఈవేళ ఏపీ ప్రజలకు దేబిరించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఆ రెండు పార్టీలూ ఢిల్లీ వీధుల్లో తెలుగువారి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాయన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ ప్రతిపాదించిన ప్రత్యేకహోదాను సాధించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఆంధ్రునిపైనా ఉందన్నారు. తెలుగువారంతా కలిసి ఇందుకు తమ హక్కుల్ని ఢిల్లీ నుంచి సాధించుకోవాలన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ, రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలన్నారు. సీమ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.

ఉత్తరాంధ్ర, రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని అందిస్తామని పార్లమెంటు సాక్షిగా ప్రధానమంత్రి ఇచ్చిన హామీల్ని వెంటనే అమలుచేయాలని గుంతకల్‌లో నిర్వహించిన సమావేశంలో బాబు అన్నారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు నాగార్జున, హరీష్‌నాయక్, మస్తాన్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**అగ్రిగోల్డ్ బాధితుల్ని చేతల్లో ఆదుకోవాలి**

అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం చేతల్లో ఆదుకోవాలని, ఇందుకోసం ప్రభుత్వం రూ.4,000కోట్లు కేటాయించాలని బాబు డిమాండ్ చేశారు. రాయదుర్గం టౌన్‌లోని రెవెన్యూ కార్యాలయం ముందు బాధితులు నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని సందర్శించి ఆయన సంఘీభావం తెలియచేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని అమలు చేయాలని కోరుతూ విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు చేస్తున్న నిరసనకు కూడా బాబు మద్దతు ప్రకటించారు. ☼

# లోక్‌సత్తా పార్టీ ఏపీ అధికార ప్రతినిధిగా రాజ్ ముదునూరి



లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధికార ప్రతినిధిగా రాజ్ ముదునూరి నియమితులయ్యారు. నెల్లూరు జిల్లాలో జరిగిన పార్టీ స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తెలిపారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి బాలసుబ్రహ్మణ్యం, ఇతర నేతలతో కలిసి రాజ్‌కు ఆయన నియామకపత్రాన్ని అందచేశారు. ఉన్నత విద్యావంతుడు, ఎంపీటీసీగా స్థానిక ప్రజలకు సమున్నత సేవలు అందిస్తున్న రాజ్.. అధికార ప్రతినిధి బాధ్యతల్ని కూడా సక్రమంగా నిర్వహించగలరని ఆశిస్తున్నామన్నారు. తన మీద ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని, లోక్‌సత్తా రాజకీయ సంస్కృతికి తగ్గట్టు హైడ్రామాలు లేకుండా ప్రజలకు మేలుచేసేలా అంశాలపై నిర్దిష్టంగా స్పందిస్తానని రాజ్ ఈ సందర్భంగా అన్నారు. ☼

# కడప స్టీల్‌ప్లాంట్ సహా పరిశ్రమలు వేగంగా రావాలి




దేశంలో ఏడాదికి 1కోటీ 30లక్షల మంది కొత్తగా ఉద్యోగాల కోసం వస్తున్నారని, కానీ అన్ని ఉద్యోగాలను సృష్టించే అవకాశాలు తక్కువగా ఉన్నాయని జేపీ అన్నారు. ప్రపంచ చరిత్రలోనే అత్యధికంగా ఉద్యోగాలను సృష్టించిన చైనా కూడా ఇంత పెద్ద సవాలును ఎదుర్కోలేదన్నారు. కానీ రాజకీయ సంకల్పం ఉంటే ఉపాధి అవకాశాలను కల్పించి సరికొత్త రికార్డును సృష్టించటం సాధ్యమేనన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా కడపలోని కోటిరెడ్డి కూడలిలో 142 రోజులుగా చేస్తున్న ఉక్కు దీక్షాశిబిరాన్ని సందర్శించి జయప్రకాష్ నారాయణ్ మాట్లాడారు.

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సహా ఎక్కడ వీలుంటే అక్కడ ఇండస్ట్రీల ఏర్పాటుకు ప్రభుత్వాలు వేగంగా చర్యలు తీసుకుంటేనే ఉపాధి సాధ్యమని జేపీ అన్నారు. కడప స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుపై మీనవేషాలు లెక్కించటం తగదన్నారు. చట్టంలో పొందుపరిచాక హామీని నీటి మీద రాతలా భావించటం జాతి భవిష్యత్తుకు ప్రమాదకరమన్నారు. యువతకు, నిరుద్యోగులకు న్యాయం జరగాలంటే ఈ పరిశ్రమ రావాలన్నారు. అయితే గతంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు సమయంలో ఉన్నన్ని సానుకూలాంశాలు ఇప్పుడు కడప స్టీల్‌ప్లాంట్‌కు లేవని స్పష్టంచేశారు. గతంలో లైసెన్స్‌రాజ్ వ్యవస్థలో స్టీల్‌కు ఎంత రేటు పెట్టినా కొనక తప్పేదికాదని, ఈవేళ నాణ్యత, తక్కువ ధర ఉంటేనే ప్రజలు కొంటారని, విదేశాలకు ఎగుమతులు సాధ్యమవుతాయని అన్నారు. బలవంతంగా కొనిపించే అవకాశాలు ప్రస్తుత మార్కెట్‌లో లేవన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు సమయంలో అంత కరడుగట్టిన బ్యూరోక్రసీ, పాలకులు ఉన్నా కూడా.. తాను ప్రత్యేక అధికారిగా వారితో పోరాడి నిర్వాసితులకభూములకు డబ్బు ఇప్పించానని, దాదాపు 8,000 కుటుంబాలవారికి ఉద్యోగావకాశాల్ని కల్పించగలిగానని జేపీ తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వమని తాను కోరటం లేదని, ఉద్యోగాలు కల్పించేందుకు తగిన పరిస్థితుల్ని కల్పించటంలో కూడా విఫలమవుతుండటం దారుణమని అన్నారు. మంచి విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, చట్టబద్ధపాలన, లంచాల్లేని సేవలు ఉంటే ఎక్కడికక్కడ ఇబ్బడిముబ్బడిగా పరిశ్రమలు వచ్చి ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ లేదా ప్రైవేటు రంగంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రాకపా రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, లింగమూర్తి, పీఏసీ వ్యవస్థాపకుడు మారంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, శేఖర్, లోక్‌సత్తా నేతలు, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ☼

## జేపీకి శుభాకాంక్షలు తెలిపిన సలావుద్దీన్



సురాజ్య యాత్రలో భాగంగా కడప నగరానికి వచ్చిన జేపీకి మైనారిటీ నాయకుడు, ప్రముఖ సంఘసేవకుడు సయ్యద్ సలావుద్దీన్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో మైనారిటీలు అనేక సమస్యల్ని ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై జేపీ స్పందిస్తూ.. అందరి సమస్యల పరిష్కారం కోసమే సురాజ్య యాత్రను చేస్తున్నామని, ఈ లక్ష్యాల్ని సాధిస్తే ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని అన్నారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌ల ద్వారా ఈ పరిష్కార కృషిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆలోచనకు పదును పెట్టే చదువున్న దేశంలోనే మార్పు




ఆలోచనకు పదునుపెట్టే, సాంకేతిక నైపుణ్యాలను అందించే చదువు కావాలని జేపీ అన్నారు. అప్పుడే యువత చేయిజాచి అర్థించేవారుగా కాకుండా, స్వతంత్ర జీవనమున్న పౌరులుగా ఎదగగలుగుతారన్నారు. ప్రభుత్వ విధానాలు సక్రమంగా ఉంటే ఈపాటికే కోట్లమంది సత్తా గలిగిన యువతతో రాష్ట్రం, దేశం ప్రపంచస్థాయిలో ఉండేవన్నారు. కూడికలు, ఎక్కాలు కూడా రాని హైస్కూలు చదువులు, నైపుణ్యంలేని ఇంజినీరింగ్ చదువులతో యువతకు సామర్థ్యం లేకుండా చేస్తున్నారన్నారు.

మచిలీపట్నంలోని పద్మావతి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సురాజ్య యాత్ర కార్యక్రమంలో విద్యార్థులతో జేపీ సమావేశమయ్యారు. సురాజ్య లక్ష్యాల చుట్టూ పలు అంశాలపై చర్చించారు. ప్రశ్నల ద్వారా ఆలోచనను రేకెత్తిస్తూ పరిష్కారాల్లో విద్యార్థులను భాగస్వాముల్ని చేశారు.

మేధస్సులేని విద్యార్థులు, యువత ఉంటే ఇష్టమొచ్చినట్టు పాలించటం తేలికవుతుందని.. సురాజ్యం రావాలన్నా, భారత్ అభివృద్ధి చెందుతున్న దేశంగా కాకుండా అభివృద్ధి చెందిన దేశంగా మారాలన్నా మేధస్సును వెలికి తీసే చదువు కావాలని జేపీ అన్నారు. విద్య పట్ల సమాజంలో ఉన్న గౌరవాన్ని, మోజును చూసి ప్రభుత్వాలు వేలకోట్లు కేటాయిస్తున్నాయి తప్ప సద్వినియోగం చేయటం లేదన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ఏం జరుగుతోందో, చదువు ఎలా అందుతోందో పట్టించుకోవటం లేదన్నారు. కేవలం మార్కులు, ర్యాంకుల కోసం ఆలోచిస్తున్నారన్నారు. ఎక్కువమంది పాసయితే చదువు బ్రహ్మాండంగా ఉందని అనుకుంటుండటంతో ఒకట్రెండు జిల్లాల్లో మినహాయించి మిగిలిన రాష్ట్రమంతా మాస్ కాపీయింగ్ జరుగుతోందన్నారు. పేరుకి విద్యార్థులు పాసవుతున్నారు, ర్యాంకులు వస్తున్నాయిగానీ నేర్చుకున్న విద్యలో పసలేదన్నారు. ప్రతి బిడ్డకూ మంచి చదువు ఖర్చు లేకుండా అందేలా చేసేందుకు చిన్న చిన్న మార్పులు చేయాలని, వీటి గురించి సమాజంలో, ప్రభుత్వంలో, రాజకీయ వ్యవస్థలో చైతన్యం కలిగించేందుకే, సాధించేందుకే సురాజ్య యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. దీంతోపాటు అన్ని వర్గాల ప్రజల ఎదుగుదలను దెబ్బతీస్తున్న ఆరోగ్యరంగాన్ని కూడా అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు మార్పుల్ని ప్రతిపాదిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరికీ ఓ ఫ్యామిలీ డాక్టర్‌ని అందుబాటులోకి తెచ్చేందుకు ఉన్న బడ్జెట్‌లోనే నమూనా బిల్లును తయారుచేశామన్నారు.

### ఆ డబ్బుకు ఫలితాలు మీ ఇంటికి వస్తున్నాయా?

తలసరి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో పౌరుని మీదా రూ.30,000 ఖర్చు చేస్తోందని, ఆ లెక్కన మచిలీపట్నంవాసుల పేరు మీద ఏడాదికి రూ.550కోట్లు ఖర్చవుతున్నాయని, కానీ ఫలితాలు మీ ఇళ్లకు వస్తున్నాయా? అని జేపీ ప్రశ్నించగా.. లేదు అని విద్యార్థులు సమాధానమిచ్చారు. అందుకే కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎలాగైతే 50.5శాతం నిధులస్తున్నాయో, అలాగే రాష్ట్రం నుంచి ప్రతి ఊరికీ, పట్టణానికీ 50శాతం నిధులు బదిలీ కావాలన్నారు. సగం రాష్ట్రం వద్ద, సగం మచిలీపట్నంలో ఉంటే.. చాలా పనుల్ని వెంటనే స్థానిక ప్రజలే చేసుకోగలరన్నారు. సురాజ్య యాత్ర లక్ష్యాల్లో స్థానిక ప్రభుత్వాల సాధికారతను కీలకాంశంగా ప్రతిపాదించామన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జేపీ జవాబులిచ్చారు.

**నాగలక్ష్మి: పనుల్లో అవినీతి ఎక్కువగా ఉంటోంది. పారదర్శకత ఉండటం లేదు. అడిగితే సమాధానం చెప్పటం లేదు.**

జేపీ: ప్రతి పనీ గడువులోగా పూర్తయ్యేలోగా ప్రభుత్వ కార్యాలయాల్లో సర్వీస్ గ్యారంటీ (పౌర సేవల) చట్టం అందుబాటులోకి రావాల్సి ఉంది. ఈ అంశాన్ని సురాజ్యం ఎజెండాలో పొందుపరిచి సాధించేందుకు కృషి చేస్తున్నాం.

**శివప్రసాద్: బందరు పోర్టుతో ఉపాధి వస్తుందా.. దానికి ఎంతమేర భూములు అవసరమవుతాయి. ఏ మేరకు అభివృద్ధి జరుగుతుంది?**

బందరు పోర్టు కొత్తగా రావటం కాదు. ఎప్పుడో ఉంది.. అభివృద్ధి జరగాలంటే భూమి తప్పనిసరిగా అవసరం. భూములు ఇవ్వాల్సిన అవసరం ఉంది. భూసమీకరణలో పాలకులు కూడా పారదర్శకంగా వ్యవహరించాలి.

**నవ్య: లంచాలు, సిఫారసులు ఉన్నవాళ్లకే ఉద్యోగాలు వస్తున్నాయి. అవి లేనివారి పరిస్థితి ఏమిటి?**

అంత నిరాశపడాల్సిన అవసరం లేదు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు కూడా లేవు. 50-100 ఉద్యోగాలకు లక్షమంది దరఖాస్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలన్నీ నిబంధనలకు అనుగుణంగా నిర్దేశించిన పరీక్షల ద్వారా జరగాల్సిందే.

**పవన్: మీలాంటివారు రాజకీయాల్లోనే ఉండాలి. ఎందుకంటే రాష్ట్రానికి దేశానికి మీలాంటి మేధావుల అవసరం ఉంది. మేమంతా మిమ్మల్ని కోరుకుంటున్నాం. పవన్‌కళ్యాణ్‌లాంటి వాళ్లతో కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని భావిస్తున్నాం.**

కనీసం 15శాతం మంది ప్రజలు అయినా కొత్త రాజకీయాన్ని కోరుకుంటారు అని భావించాం. కానీ అలా జరగలేదు. ప్రస్తుతం లోక్‌సత్తా చేస్తున్న కార్యక్రమం కూడా రాజకీయమే. కానీ ఎన్నికలు ఉండవు. ప్రజాస్వామ్యంలో మంచి ఎజెండాతో ప్రజలకు సుపరిపాలన అందించటానికి ఎవరు ముందుకొచ్చినా మద్దతు అందించడానికి మనమంతా సిద్ధంగా ఉందాం.

చట్టం అందరికీ సమానంగా అమలవకపోవటం, మహిళల భద్రత కనిపించకుండా ఉన్న పెద్ద సమస్యలని జేపీ అన్నారు. పోలీసులు టార్చర్ చేసి నేరాలను అమాయకుల చేత కూడా ఒప్పించటం జరుగుతోందని, పోలీసు వ్యవస్థ సామర్థ్యంతో శిక్షలు పడుతున్నది కేవలం నూటికి ఆరు నుంచి పది కేసుల్లో మాత్రమేనని అన్నారు. మచిలీపట్నం చుట్టుపక్కల ఊళ్లలో పలువురు యువత వ్యవసాయం నుంచి పారిపోవాలని చూస్తున్నారని, మరోవైపు పట్టణాల్లో సరైన ఉపాధి అవకాశాలు లేవని అన్నారు. రాష్ట్రంలో, దేశంలో అత్యధికులు ఆధారపడిన వ్యవసాయాన్ని బాగు చేయటానికి ప్రస్తుత విధానాలను పూర్తిగా మార్చాల్సుందన్నారు. గత మూడేళ్లలోనే ఎగుమతులను తగ్గించి, దిగుమతులను పెంచే విధానాల్ని పాలకులు అనుసరించటం వల్ల ఏడాదికి 19 బిలియన్ డాలర్ల నష్టం మన రైతులకు వచ్చిందన్నారు. కేవలం ప్రభుత్వ విధానాలను సరిచేస్తే రైతులకు మంచి ధరలు నిలకడగా లభిస్తాయన్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలతో చిన్న పట్టణాల్ని అభివృద్ధి చేస్తూ రిటైల్ చెయిన్లను ప్రోత్సహిస్తే గ్రామాల చుట్టూనే బోలెడుమందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఇవన్నీ ఖర్చు లేకుండా, సులభంగా ప్రభుత్వాలు చేసేయొచ్చన్నారు. కానీ జనం జీవితాలు మాత్రం గణనీయంగా బాగుపడతాయన్నారు.

### అప్పటికీ, ఇప్పటికీ బందరులో పెద్ద తేడా లేదు

తాను 10వ తరగతి చదువుతున్నప్పుడు బందరు వచ్చానని, అప్పటికీ ఇప్పటికీ పెద్ద తేడా ఏమీ కనిపించటంలేదని జేపీ అన్నారు. పాలన, రాజకీయం అధ్వాన్నతీరు గురించి చెప్పటానికి వేరే సాక్ష్యాధారాలు అవసరం లేదన్నారు.

చదువుల్ని పక్కనపెట్టి సురాజ్యం గురించి ఆలోచించనక్కర్లేదని, కనీసం కొంతమేర సమయాన్ని, శక్తిని సమాజం కోసం కేటాయించాలని జేపీ సూచించారు. అలా చేయటం వల్ల తిరిగి మనకే అనేకరెట్లు లాభం చేకూరుతుందన్నారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదై పరిష్కారంలో భాగమవ్వాలని కోరారు.

హిందూ కళాశాల అనుబంధ సంస్థల అధ్యక్షుడు డాక్టర్ పి.ధన్వంతరి, పీజీ సెంటర్ రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.సారంగపాణి, సహ చట్టం ప్రచార చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వి.హేమసుందరరావు, న్యాయవాది వడ్డి జితేంద్ర, లోక్‌సత్తా నేతలు రామ్మోహనరావు, బాబ్జీ, అంకెం జితేంద్ర కుమార్, భీమేశ్వరరావు, వైబీఐ కన్వీనర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ☼

# మ్యాక్స్ సంఘాలుగా ఏర్పడి పంటల్ని అమ్ముకోండి



రైతులందరూ ఒకరికొకరు సహకారం అందించుకుంటూ మార్కెటింగ్ చేసుకుంటే లాభాలు గ్యారంటీ అని జేపీ అన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో సేంద్రియ ఎరువులను ఉపయోగించుకుంటూ తమ ప్రాంతాలకు అనువైన పంటలను వేసుకోవాలన్నారు. ఇందుకోసం పంటలు, పార్టీలు, కులాలు, ప్రాంతాలు, ఇతర విభేదాలకతీతంగా రైతులంతా ఏకమవ్వాలన్నారు.

నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం దేవిస్‌పేట జైన్ మందిరంలో రైతులతో సురాజ్య యాత్ర కార్యక్రమం లో జేపీ పాల్గొన్నారు.

సన్న, చిన్నకారు, సగటు రైతులు పడుతున్న కష్టాలను ప్రస్తావిస్తూ, ఇవేవీ రైతుల నుదుట రాసిన రాతలు, ఖర్మ కాదని, కేవలం పాలకులు చేస్తున్న పాపమని జేపీ అన్నారు. రైతుల కష్టాలకు పరిష్కారాలున్నాయన్నారు. వీటిని లోతుగా చర్చించి రైతుల్ని పరిష్కారంలో భాగం చేసేందుకే సురాజ్య యాత్ర చేపట్టామని తెలిపారు. ఇక్కడ కూరగాయల రైతులు ఎక్కువగా ఉన్నారని, ఒక యూనిట్‌గా ఏర్పడి 'మ్యాక్స్' చట్టం కింద నమోదై మార్కెట్ కార్యకలాపాల్ని నిర్వర్తించుకోవాలని అన్నారు. పరస్పర సహాయ సహకార చట్టంగా 1995లో వచ్చిన మ్యాక్స్‌ని లోక్‌సత్తా కృషితో వచ్చిన 97వ రాజ్యాంగ సవరణ మరింత పటిష్టం చేసిందన్నారు. ఇలా సహకార సంఘంగా రైతులు లావాదేవీలు నిర్వహించుకుంటే.. డిమాండ్ లేనప్పుడు కూడా పంట ఉత్పత్తులకు ధర దారుణంగా పడిపోదన్నారు. లాభాలు బాగా వచ్చినప్పుడు, ఆ డబ్బును సభ్యులుగా ఉన్న రైతుల మధ్యే పంచుతారన్నారు. రైతులు సహకార మార్కెటింగ్ చేసుకుంటే దళారులు కూడా భయపడతారన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, ప్రభుత్వాల జోక్యాన్ని మార్కెటింగ్‌లో పెంచుకున్నకొద్దీ రైతులకు కష్టాలు వస్తూనే ఉంటాయని అన్నారు.

దేశవ్యాప్తంగా రైతులు పంట పండించినప్పుడు కూడా పాలకుల విధానాల వల్ల నష్టపోతున్నారని జేపీ అన్నారు. అప్పులపాలవుతూ కుంగిపోతున్నారన్నారు. దేశానికి స్వతంత్రం వచ్చి 70 ఏళ్లయినా, జనాభాలో అత్యధిక సంఖ్యాకులు ఆధారపడిన వ్యవసాయరంగాన్ని బాగు చేసేందుకు పాలకులు ఇప్పటికీ చిత్తశుద్ధిని ప్రదర్శించకపోవటం దారుణమన్నారు. రైతులకు న్యాయమైన ధర అందించేలా నూతన వ్యవసాయ విధానాలను రూపొందించటం మీదే దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికలకు ఇంకో ఏడాదిన్నర సమయం ఉన్నా రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షం ఇంటింటికీ తిరుగుతున్నాయని, ఆ పనుల్లో పడి రైతుల సమస్యల్ని మాత్రం పట్టించుకోవటం లేదని అన్నారు. రైతుల్ని ఓటుబ్యాంకులుగా చూస్తున్నారు తప్ప రైతు కష్టాలను తీరుద్దామన్న ధ్యాస లేదన్నారు.

అనంతరం రైతులతో స్థానిక సమస్యల గురించి చర్చించారు. మండలానికి తొలిసారిగా వచ్చిన జేపీకి రైతులు, ఇతర గ్రామీణులు ఘనంగా స్వాగతం పలికారు.

లోక్‌సత్తా నేతలు రామ్మోహనరావు, బాలసుబ్రహ్మణ్యం, కొప్పోలు రామారావు, పీవీఎల్ రవికుమార్, సుల్తానీ, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ☼

## ల్యాబ్ టెక్నీషియన్ ఎందుకు లేరు?



రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని ముత్తుకూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి జేపీ సూచించారు. సురాజ్య యాత్రలో భాగంగా ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను ఆయన పరిశీలించారు. ల్యాబ్ టెక్నీషియన్ ఎందుకు లేరు అని ప్రశ్నించారు. ప్రభుత్వం నియమించలేదని వైద్యాధికారిణి డాక్టర్ శశికళ తెలిపారు. హాస్పిటల్‌కు వస్తున్న మందులు, ఓపీ గురించి జేపీ చర్చించారు. ఇక్కడ ఆస్పత్రిని మెరుగుపరిస్తే పెదాస్పత్రుల మీద ఒత్తిడి తగ్గి వైద్య సేవలు మెరుగుపడతాయని, అందువల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలని అన్నారు. ఇక్కడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

# అభిప్రాయాలు చెప్పండి
# -ప్రజలకు 15వ ఆర్థిక సంఘం ఆహ్వానం-




ఆర్థిక వనరులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ కోసం ఉద్దేశించిన 15వ ఆర్థిక సంఘం తనకు కేంద్రప్రభుత్వం నిర్దేశించిన విధివిధానాలపై సామాన్య ప్రజల నుంచి అభిప్రాయాలను ఆహ్వానించింది. సాధారణ ప్రజలు, సంస్థలు, సంఘాలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పొచ్చని తెలిపింది. మాజీ ఐఏఎస్ అధికారి, రాజ్యసభ మాజీ సభ్యుడు ఎన్కే సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన 15వ ఆర్థిక సంఘం ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక స్థితిగతులు, లోటు, రుణాల స్థాయి, నగదు నిల్వలు, ఆర్థిక క్రమశిక్షణను సమీక్షించి బలమైన ఆర్థిక నిర్వహణ కోసం కచ్చితమైన మార్గనాచీని సిఫార్సు చేస్తుంది. రుణాలు, లోటు పరిమితులను అంచనా వేసే క్రమంలో కమిషన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలనూ పరిగణలోకి తీసుకుంటుంది. అందరికీ రెవెన్యూలోటు గ్రాంట్లు ఇవ్వాలా? లేదా అన్నది పరిశీలిస్తుంది.

నవంబర్ 27, 2017న ఏర్పాటైన ఈ కమిషన్ 2019 అక్టోబర్ 30కల్లా నివేదికను కేంద్రానికి అందించాలి. 2020 ఏప్రిల్ 1 నుంచి దీని సిఫార్సులు అమల్లోకి వస్తాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఈ కమిషన్ సిఫార్సులు చేస్తుంది.

**కమిషన్ సమీక్షించబోయే ప్రధానాంశాలు :**

- దేశవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ మరోవైపు 14వ ఆర్థికసంఘం సిఫార్సుల మేరకు కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పెద్దఎత్తున వాటా ఇవ్వడం వల్ల కేంద్ర ఆర్థిక పరిస్థితిపై ఎంతమేర ప్రభావం పడుతోంది?
- జీఎస్టీ అమల్లోకి వచ్చాక రాష్ట్రాలకు ఏర్పడే పన్ను నష్టం భర్తీ, పలు సుంకాల రద్దు, పరిహారం చెల్లింపు కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు, ఇతర నిర్మాణాత్మక సంస్కరణల అమలు సహా జీఎస్టీ ప్రభావం ఎంత? అది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక స్థితిపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతోంది?
- జీఎస్టీ కింద పన్ను పరిధిని పెంచుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు ఏంటి?
- జనాభా పెరుగుదల రేటును మార్చడానికి తీసుకుంటున్న చర్యల్లో పురోగతి?
- పన్ను, పన్నేతర ఆదాయాన్ని పెంచుకోవడంలో సాధించిన పురోగతి, ప్రత్యక్ష నగదు బదిలీని ప్రోత్సహించడం ద్వారా ప్రజాధనం ఆదా, పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ప్రోత్సాహం, ప్రభుత్వం, లబ్ధిదారుల మధ్య అంతరాన్ని తగ్గించడం.
- పారిశుద్ధ్యంలో సాధించిన ప్రగతి, ఘనవ్యర్థాల నిర్వహణ, బహిరంగ మల విసర్జనకు వెళ్లకుండా ప్రజల అలవాట్లను మార్చడం

## తెలుగు భాషా వికాస సంవత్సరంగా 2018

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018ని తెలుగు భాషా వికాస సంవత్సరంగా అధికారికంగా ప్రకటించింది. ☼

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

➢ ప్రస్తుతం చాలామంది వ్యాపార అనుకూల వాతావరణం గురించి మాట్లాడుతున్నారు. ఒక వ్యాపారవేత్తగా కాకుండా వ్యక్తిగతంగా చెప్పాలంటే వ్యాపార అనుకూల వాతావరణం కంటే కూడా.. జీవించడానికి అనుకూల వాతావరణం, అవకాశాల సృష్టి, అందిపుచ్చుకునేందుకు అనుకూల వాతావరణం ఉన్నప్పుడే వృద్ధి సాధించగలం. వ్యవసాయం, విద్య, వైద్యం దేశానికి పెద్దసవాళ్లు.

-ముఖేష్ అంబానీ, రిలయన్స్ గ్రూప్ అధినేత

➢ సోషల్ డెమోక్రసీని అనుసరించే స్కాండినేవియా దేశాల్లో ప్రజల పన్నుల డబ్బుతో మంచి విద్యను, ఆరోగ్యాన్ని అందిస్తున్నారు. ప్రభుత్వ సేవల్ని సక్రమంగా అందకపోతే అక్కడ తీవ్ర పరిణామాలు ఉంటాయి. కానీ మనదేశంలో ఆరకంగా ప్రభుత్వాలపై ఒత్తిడి పెట్టాల్సిన ఉన్నత, ఎగువ మధ్యతరగతివారు.. ప్రభుత్వ సేవలు మాకు అక్కర్లేదన్నట్టు వ్యవహరిస్తున్నారు. సొంత స్కూళ్లు, ఆస్పత్రులు, సొంత సెక్యూరిటీ, రవాణా సాధనాలు సమకూర్చుకుంటున్నారు. కానీ ఒక స్థాయి దాటి ఉమ్మడి అవసరాలను సొంతంగా సమకూర్చుకోవటం సాధ్యం కాదని ఢిల్లీలో కాలుష్యం తేటతెల్లం చేస్తోంది. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందించేలా చేయకపోతే.. సామాన్య ప్రజలతో పాటు తామూ నష్టపోతామని ఢిల్లీ అనుభవం నుంచి సంపన్నులు నేర్చుకోవాలి. పలుకుబడి, పవర్, నైతిక దృష్టి ఉన్నవారు గళం విప్పాలి. ప్రభుత్వ సేవలను ప్రక్షాళన చేయటం ఇప్పుడు ఇండియాకు కీలకావసరం.

– రోహిణీ నీలేకని, వితరణశీలి, 'అర్ఘ్యం' ఛైర్మన్

➢ ప్రజలకు సంబంధించిన ప్రతి అంశంలోనూ స్వార్థ ప్రయోజనాలు ప్రస్తుతం పట్టుసాధిస్తున్నాయి. ఉన్నతాధికార వర్గం, ఆర్థిక ప్రయోజనాలు, చివరకు పట్టణ, నగర ప్లానింగ్ కూడా అంతిమంగా ప్రజలు నష్టపోయే ప్రక్రియలనే అమలు చేస్తూ వస్తున్నాయి. ఈ అసంబద్ధ పరిణామం సంభవించని ప్రాంతం దేశంలో ఎక్కడైనా ఉందేమో వెనక్కు తిరిగి ఆలోచించండి.

- మహేష్ విజాపుర్కర్, సీనియర్ పాత్రికేయులు

➢ పాలకులు ప్రజలకు మంచి చేసి ఉంటే నేను రాజకీయాల్లోకి వచ్చే వాణ్ణి కాదు. నేను నటుడిగా మరణించాలనుకోవడం లేదు. ప్రజా సేవకుడిగానే మరణిస్తా. అందుకే ఇక సినిమాల్లో నటించను. విశ్వరూపం-2, భారతీయుడు-2 సినిమాలే ఆఖరు. 'మక్కల్ నీది మయ్యమ్' (ఎంఎన్ఎం) పార్టీ జెండాలోని ఆరు చేతులు ఆరు దక్షిణాది రాష్ట్రాలను (పుదుచ్చేరి సహా), మధ్యలోని నక్షత్రం ప్రజలను సూచిస్తాయి. ప్రజలను, న్యాయాన్ని కేంద్రంగా చేసుకుని ఆవిర్భవించిన పార్టీ ఇది. ఓటుకు రూ.6వేలు ఇస్తారా? అని నన్ను కోరితే నా దగ్గర డబ్బుల్లేవు, ఉన్నా ఇవ్వబోను. ఇప్పటివరకూ అవినీతిని చోద్యంగా చూశాం. ఇకపై అది చేయకూడదు.

– కమల్ హాసన్, ఎంఎన్ఎం పార్టీ వ్యవస్థాపకుడు

➢ పరీక్షలు అనగానే 'భారతరత్న' ఆచార్య సీఎన్ఆర్ రావు గుర్తుకొస్తారు. పదేళ్లు నిండక ముందే సెకండరీ పరీక్షల్లో ప్రథములుగా ఉత్తీర్ణులైన మేధావి ఆయన. పదిహేడేళ్లకే డిగ్రీ పట్టా సాధించి, మైసూరు విశ్వవిద్యాలయంలో సరికొత్త రికార్డు సృష్టించారు. ప్రపంచవ్యాప్తంగా 63 వర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్న రావు దృష్టిలో- ఇండియాలో పరీక్షల వ్యవస్థే తప్ప విద్యావ్యవస్థ లేదు. అదీ 'నానాటికీ తీసికట్టు' బాపతు!

భ్రష్టుపట్టడం అంటే ఏమిటో, మన పరీక్షల విధానాన్ని చూస్తే ఇట్టే అర్థమవుతుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చూచిరాతల వంటి పరీక్షల అక్రమాలకు లెక్కేలేదు. నిరుడు పదో తరగతి పరీక్షలకు సంబంధించి తెలంగాణలో నాలుగు, ఆంధ్రప్రదేశ్‌లో ఒకే ఒక కేసు నమోదు కావడం పట్ల ఉమ్మడి ఉన్నత న్యాయస్థానం విస్మయం వ్యక్తం చేసింది.

– శరత్

➢ ఇవాళ ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ కార్యాలయం చూసినా, ఆ పార్టీలో చాలామంది నేతల్ని చూసినా బీజేపీ ఎక్కడి నుంచి ఎక్కడకు ఎదిగింది అన్న ఆశ్చర్యం కలుగుతుంది. కాలం మారుతున్నా ఇంకా వెనుకటి పరిస్థితులే కొనసాగాలని కానీ, పార్టీ కార్యాలయాలు ఇంకా శిథిలావస్థలో ఉండాలని కానీ ఎవరూ కోరుకోరు. కానీ కాలం ఎవరికి మారింది.. అన్న ప్రశ్న మాత్రం వేసుకోవాలి. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో పేదలు, పోషకాహార విలువలు అందని పసిపిల్లలు భారతదేశంలోనే ఉన్నారు. ఆరోగ్య సంరక్షణ విషయంలో మనదేశం ప్రపంచంలో 154వ స్థానంలో ఉంది. ప్రతి ఏటా వేలాది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటూనే ఉన్నారు. ఢిల్లీలో ఫుట్‌పాత్‌లపై, చాలీచాలని పూరి గుడిసెల్లో పడుకొని చలికి తట్టుకోలేక ప్రతి ఏడాది అనేకమంది మరణిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో.. మన ప్రజల పరిస్థితికీ, మన నాయకుల పరిస్థితికీ, మన గ్రామాల పరిస్థితికీ, మన పార్టీల కార్యాలయాల పరిస్థితికీ ఏమైనా పొంతన ఉన్నదా అని ప్రశ్నించుకోవాలి. నాయకులంటే డబ్బులు విసిరేవారు, ప్రజలంటే ఆ డబ్బుల వెనుక పరిగెత్తి ఏరుకునేవారుగా కనబడుతోంది. కాంగ్రెస్ హయాంలో ఖత్రోకీ లాంటివారు దేశం విడిచి వెళ్లినట్లు ప్రస్తుతం కూడా నేరస్తులు విదేశాలకు వెళ్లి సుఖంగా గడుపుతున్నారు. తిమ్మిని బమ్మి చేసి, మసిపూసి మారేడుకాయ చేసి, ప్రత్యర్థులను బలహీనం చేసి, పార్టీలను విడగొట్టి, కొందరికి చాటుగా మేలు చేసి, మరికొందర్ని భయపెట్టి, వ్యవస్థల్ని మరింత నిర్వీర్యం చేసి, కేవలం ఒకరిద్దరే దేశాన్ని ఏలుతున్న వాతావరణం స్పష్టంగా కనిపిస్తోంది. ఇవాళ నరేంద్రమోదీ, అమిత్‌షాలు మాట్లాడుకుంటుంటే చూసేవారికి ఇద్దరు సంపన్న వ్యాపారులు మాట్లాడుకుంటున్నట్టు కనిపించినా అతిశయోక్తి కాదు.

- ఎ. కృష్ణారావు, సీనియర్ జర్నలిస్టు

➢ 2014లో నా పుస్తకం 'యాంటిసిపేటింగ్ ఇండియా' ముందుమాటలో ఒక ముఖ్యమైన అంశం ప్రస్తావించాను. మోదీ, రాహుల్, కేజ్రీవాల్.. ముగ్గురు నేతలూ పరిణతి సాధిస్తారని అభిప్రాయం వ్యక్తం చేశాను. మోదీ ప్రధాన స్రవంతి సమన్వయం వైపుగా పయనిస్తారని, రాహుల్ బహిరంగ జీవితంలో బిడియాన్ని పక్కన పెడతారని రాశాను. కేజ్రీవాల్ వ్యవస్థాగతమైన శాంతి వైపు పయనిస్తారని రాశాను. ఈ మూడో అంశంలో నా అంచనా తప్పు అని (ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాష్‌పై సాక్షాత్తూ ముఖ్యమంత్రి నివాసంలో ఆప్ ఎమ్మెల్యేలు దాడి చేసిన ఘటన జరిగిన) ఈ వారం మనకు చెబుతోంది.

- శేఖర్ గుప్తా, సీనియర్ సంపాదకులు

➢ *హైదరాబాద్‌తోపాటు శివార్లలో ఎక్కడా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదంటే ఆశ్చర్యం కలుగుతోంది. డబుల్ బెడ్‌రూం స్కీమును కలపకుండా.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణ రాష్ట్రానికి రెండు విడతల్లో కేటాయించిన 1.87 లక్షల ఇళ్లను విడిగా నిర్మించినా ఈపాటికి పూర్తయ్యేవి కదా!*

*- రామ్ కృపాల్ యాదవ్, కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి*

➢ నా దగ్గరకు పది సమస్యలు వస్తేనే పరిష్కారానికి చాలా సమయం పడుతోంది. మరి లక్షల సమస్యలు పరిష్కారమయ్యాయని రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) అధికారులు చెప్పటం నమ్మశక్యంగా లేదు.

- ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ మంత్రి

➢ *ఎంతటి ఘోరమైన పరిస్థితిలో జీవిస్తున్నప్పటికీ మార్పు కోసం కలగనడం మాత్రం మానొద్దు. ప్రపంచాన్ని మార్చగల శక్తి స్వప్నాలకు ఉంది. ఒక శిశువుగా చదువు గురించి కలల్లో మునిగితేలడంతోనే విజ్ఞానాన్ని దక్కించుకోగలిగాను. మార్పు ఎప్పుడూ సమాజహితాన్ని కోరేవారి వైపే ఉంటుంది.*

*– గూగీ వా థియాంగో, కెన్యన్ సాహితీవేత్త*

(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, టైమ్స్ ఆఫ్ ఇండియా, సోషల్ మీడియా) ☼

# ప్రజల గోడు పట్టని గవర్నర్, ముఖ్యమంత్రి




బ్యాంకులను లక్షల కోట్ల మేర దర్జాగా దోచేస్తున్న రాజకీయ నేతలు, అధికారులు, బడాబాబుల్ని పట్టుకోవటం చేతగాని పాలకులు సామాన్యుల మీద మాత్రం ప్రతాపం చూపుతున్నారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. బ్యాంకింగ్ సేవలు సక్రమంగా అందక, ఏటీఎంలలో నగదు దొరక్క కోట్లాది ప్రజలు ఇబ్బందులు పడుతున్నా దిక్కు లేకుండా పోయిందన్నారు. డీమానిటైజేషన్ (పెద్ద నోట్ల రద్దు) ప్రభావం తొలగిపోయిందని చెబుతూనే గత మూడు నెలలుగా ప్రజలకు బ్యాంకులు చుక్కలు చూపిస్తున్నాయన్నారు. వేతనాలు, దాచుకున్న డబ్బులు చెల్లించడానికి కూడా బ్యాంకులు వేధిస్తున్నాయంటే.. ఇక ప్రభుత్వాలెందుకు? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో గవర్నర్, ముఖ్యమంత్రి వెంటనే చొరవ తీసుకోవాలన్నారు. సామాన్యులకు బ్యాంకింగ్ సేవలు అధ్వాన్నమవటంపై విజయనగరంలో గాంధీ విగ్రహం వద్ద ఆయన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కరెన్సీ నోట్లపై ముద్రించటం తప్ప గాంధీ సేవాభావాన్ని పాలకులు పాటించటం లేదన్నారు. విద్యార్థులు ఫీజులు చెల్లించటానికి కూడా అల్లాడుతున్నారని లోక్‌సత్తా పార్టీ నేత నాగభూషణం అన్నారు. పార్టీ నేతలు మొల్లేటి చిన్నారావు, శిమ్మ శ్రీను, వెంకటరమణ, జామి ఎర్నిబాబు, ఆదీశ్వరరావు, ఎస్.అమృత, ప్రియాంక, భారతి, రేణుక, పి.సంగీత, ప్రాణప్రసన్న, శాంతి, దివ్య, సలోమి తదితరులు పాల్గొన్నారు. ☼

---

# రైతులకు మీ దానాలు అక్కర్లేదు.. ధర లభించే విధానాలు అమలు చేయండి చాలు







రైతుల పంటలకు గిట్టుబాటు ధర రాకుంటే మార్కెట్ జోక్యం చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు అన్నారు. ఆహారభద్రత క్రెడిట్‌ను తమ ఖాతాల్లోనూ, అందుకోసం భారాన్ని మాత్రం రైతుల ఖాతాల్లోనూ వేసి దశాబ్దాలపాటు పాలకులు పంటల ధరల్ని కృత్రిమంగా అణగదొక్కుతున్నారన్నారు. రైతులకు ఆదాయం చుట్టూ వ్యవసాయం ఉండాలన్న లోక్‌సత్తా వాదన ఇప్పుడిప్పుడే ప్రాచుర్యంలోకి వస్తోందన్నారు. స్వామినాథన్ కమిషన్ చెప్పిన ప్రకారం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్న హామీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమల్లోకి తేవాలన్నారు. సూర్యాపేట రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో జరిగిన నల్గొండ, సూర్యాపేట జిల్లాల లోక్‌సత్తా పార్టీ నేతల సమావేశంలో ఆయన పాల్గన్నారు. పైపైన హడావుడి చేయకుండా, రైతు సమస్యలపై నిర్దిష్ట కార్యాచరణతో పనిచేయాలని సూచించారు. కల్తీ విత్తనాలు, కల్తీ పురుగుమందులు వల్ల రైతులు మొదట మోసపోతున్నారని, ఆ తర్వాత మార్కెట్లో నష్టపోతున్నారని అన్నారు. రైతులకు ప్రభుత్వం ఏమీ దానం చేయనక్కర్లేదని, వారి పట్ల తన బాధ్యతను సక్రమంగా నెరవేరిస్తే చాలు రైతుల ఆదాయం పెరుగుతుందని స్పష్టం చేశారు. లోక్‌సత్తా నేతలతో కలిసి వ్యవసాయ మార్కెట్ యార్డుని సందర్శించి రైతులు, కమిటీ ప్రతినిధులతో ధరల హెచ్చుతగ్గులపై చేపడుతున్న చర్యల వివరాలను పాండురంగారావు తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గారావు, కార్యదర్శి సరోజాదేవి, సూర్యాపేట, నల్గొండ జిల్లాల నాయకులు సత్తయ్య, పల్లేటి రమేష్ కుమార్, బండారు నాగరాజు, వీరప్రతాపరావు, లింగయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ☼

YBI Youth for Better India

WOMEN'S PARLIAMENT PROGRAM

YOUTH PARLIAMENT







# #
# వైబీఐ విమెన్స్ పార్లమెంట్

మహిళలు సామాజిక, ఎన్నికల రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని సాధికారతను సాధించుకునే దిశగా కావలసిన చట్ట బద్ధపాలన, విద్య, ఆరోగ్యం, ఉపాధి, ఇతర అంశాలు ఎజెండాగా... యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ), యూత్ పార్లమెంట్ ఇటీవల హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీలో విమెన్స్ పార్లమెంట్‌ను నిర్వహించాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఇందుకు సందర్భంగా ఉపయోగించుకున్నాయి.

Posting Date 22-03-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on March 16th, 2018



# భారత్‌లో విధానాల దశ - దిశ

సెంటర్ ఫర్ సివిల్ సొసైటీ బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో నిర్వహించిన ఐపాలసీ కార్యక్రమంలో 'భారత్‌లో విధానాల దశ-దిశ, అధికార వికేంద్రీకరణ' పై యూత్‌నుద్దేశించి మాట్లాడుతున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad